CELEBRATING 11TH YEAR ANNIVERSARY
ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 60 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : నరసరావుపేట గురువారం 6 నవంబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 60 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : NARASARAO PETA THU 6 NOVEMBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# కూటమి ప్రభుత్వంలోనే
# రైతుకు న్యాయం

- ఖరీఫ్‌లో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు
- రైతులకు 24 గంటల్లోనే నగదు జమ చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్న మంత్రి
- గత ప్రభుత్వం రూ.1,670 కోట్ల బకాయిలు పెట్టిందని ఆరోపణ
- జనవరి నుంచి కార్డుదారులకు రూ.18కే కిలో గోధుమపిండి పంపిణీ
- రైతులకు ఉచితంగా 50 వేల టార్పాలిన్‌లు అందజేత
- ఈ-క్రాప్ నమోదు చేసినా ధాన్యం కొంటామని రైతులకు భరోసా



పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతోనే రైతులకు నిజమైన న్యాయం జరుగుతోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని ఆయన వెల్లడించారు. విజయవాడలోని సివిల్ సప్లై భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు.సుమారు రూ.12,200 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 4,041 రైతు సేవా కేంద్రాలు, 3,803 ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేశామని, 16,700 మంది సిబ్బంది ఈ ప్రక్రియలో పాల్గొంటారని వివరించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని 6 కోట్ల గోతాలను అందుబాటులో ఉంచామన్నారు.

**గత ప్రభుత్వ నిర్వాకం.. మా ప్రభుత్వ పారదర్శకత**

గత ప్రభుత్వం రైతులకు రూ.1,670 కోట్ల బకాయిలు పెట్టి వెళ్లిందని, ధాన్యం డబ్బులను 6 నుంచి 9 నెలల వరకు చెల్లించకుండా ఇబ్బంది పెట్టిందని నాదెండ్ల మనోహర్ విమర్శించారు. అయితే, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 87 శాతం ధాన్యం డబ్బులను కేవలం 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేసిందని గుర్తుచేశారు. ఈసారి ఆ సమయాన్ని 24 గంటలకు తగ్గించేందుకు కృషి చేస్తున్నామని హామీ ఇచ్చారు. తేమ శాతం కొలతలో పారదర్శకత కోసం ఒకే కంపెనీకి చెందిన యంత్రాలను వాడతామని, అవసరమైతే బ్లూటూత్ ద్వారా రీడింగ్ తీసుకునే వ్యవస్థ ఏర్పాటు చేస్తామని చెప్పారు. వాట్సాప్‌లో "%ఎ×%" అని మెసేజ్ చేయడం ద్వారా రైతులు తమ ధాన్యం అమ్మకం షెడ్యూల్ చేసుకునే సౌకర్యాన్ని కూడా కల్పించామన్నారు.

**కొత్త పథకాలు, రైతులకు భరోసా**

జనవరి నుంచి రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి కిలో గోధుమపిండిని రూ.18కే అందిస్తామని మంత్రి ప్రకటించారు. ఇందుకోసం 2,400 మెట్రిక్

వివరాలు 2లో..



## తెలంగాణ సరిహద్దు సమీపంలో కాల్పుల మోత... ముగ్గురు మావోయిస్టుల మృతి

- ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్
- కూంబింగ్ ఆపరేషన్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి
- మృతదేహాలు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్న బలగాలు
- జనవరి నుంచి ఇప్పటివరకు 477 మంది మావోయిస్టుల హతం
- ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని వెల్లడి

వివరాలు 2లో..



## ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ కు డాక్టరేట్...
### మంత్రి నారా లోకేశ్ స్పందన

- ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు అరుదైన గౌరవం
- కర్ణాటక స్టేట్ లా యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్
- న్యాయ, చట్ట పరిరక్షణకు చేసిన సేవలకు ప్రత్యేక గుర్తింపు
- గవర్నర్‌కు మంత్రి నారా లోకేశ్ హృదయపూర్వక అభినందనలు
- ఇది ఏపీ ప్రజలందరికీ గర్వకారణమని లోకేశ్ వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్‌కు అరుదైన గౌరవం లభించింది. న్యాయ, చట్ట పరిరక్షణ రంగాల్లో ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా కర్ణాటక స్టేట్ లా యూనివర్సిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ గవర్నర్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.గవర్నర్ అబ్దుల్ నజీర్ గౌరవ డాక్టరేట్ అందుకోవడం పట్ల మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. "చట్టం, న్యాయ పరిరక్షణకు గవర్నర్ గారు చేస్తున్న అపారమైన కృషికి దక్కిన అరుదైన గౌరవం ఇది. ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ ఇది గర్వకారణం"

వివరాలు 2లో..

## రైలు ఢీకొని ఆరుగురు భక్తుల మృతి



- మీర్జాపూర్‌లో ఘోర రైలు ప్రమాదం
- పట్టాలు దాటుతున్న ఆరుగురు భక్తుల దుర్మరణం
- కార్తిక పౌర్ణమి స్నానం కోసం వారణాసికి ప్రయాణం
- చునార్ స్టేషన్‌లో ఆగకుండా వెళ్లిన ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని ఘటన
- మృతుల కుటుంబాలకు సీఎం యోగి ఆదిత్యనాథ్ సంతాపం
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

వివరాలు 2లో..

## 'వసంతం-2025' వస్త్ర ప్రదర్శన ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్...

- విజయవాడలో 'వసంతం-2025' చేనేత ఎగ్జిబిషన్ ప్రారంభం
- ముఖ్య అతిథిగా మంత్రి నారా లోకేశ్
- 'కొత్తూరు వసంత వర్ణ' నూతన బ్రాండ్ ఆవిష్కరణ
- సహజసిద్ధ రంగులతో తయారైన కొత్త బ్రాండ్




వివరాలు 2లో..

## ఫొటోల కోసం బురద లేని పొలంలో మట్టి అంటకుండా జగన్ పర్యటించారు



- జగన్‌ది రైతు పరామర్శ కాదని, దండయాత్ర అని విమర్శ
- రైతులు ఓట్లు వేయలేదనే అక్కసుతోనే జగన్ పర్యటించారన్న వెంకన్న
- వందల కార్లు, పెయిడ్ ఆర్టిస్టులతో పరామర్శకు వెళ్లారని ఎద్దేవా

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో జరిపిన పర్యటనపై టీడీపీ నేత బుద్దా వెంకన్న తీవ్రస్థాయిలో

వివరాలు 2లో..

## హర్యానాలో ప్రతీ 8 ఓటర్లలో ఒకరు ఫేక్..
### రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు




- మొత్తం ఓటర్లలో 12.5 శాతం ఫేక్ ఓటర్లే
- బ్రెజిల్ కు చెందిన మోడల్ హర్యానాలో మూడు ఓట్లు
- ఒకే మహిళ వందసార్లు ఓటేసిందని రాహుల్ ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:హర్యానా ఎన్నికల్లో భారీగా అక్రమాలు జరిగా యని కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. బుధవారం ఉదయం 'హైడ్రోజన్ బాంబ్' పేరుతో మీడియాతో

వివరాలు 2లో..



## తిరుమల లడ్డూ ప్రసాదంలో నాణ్యత పెంచాం

ఏఐ ప్రాజెక్టును పట్టాలెక్కిస్తాం..
తితిదే పరిధిలోని ఆలయాల్లో నిత్యాన్నదానం
కరీంనగర్, దుబ్బాకలో శ్రీవారి ఆలయాలు

పెన్ పవర్ డెస్క్:: తిరుమల దేవదేవుడి పవిత్రతను పెంచాలనేది బోర్డు నిర్ణయమని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు(%దీ= చీఖఱఅఎబ%) పేర్కొన్నారు. ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా హైదరాబాద్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.

**ఏఐ ప్రాజెక్టును పట్టాలెక్కిస్తాం..**

"గతంతో పోలిస్తే తిరుమల అన్నప్రసాదాల్లో మార్పులు వచ్చాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా నాణ్యమైన పదార్థాలతో రుచికరమైన భోజనం అందిస్తున్నాం. తిరుమలలో రోజూ 1.5లక్షల నుంచి 2లక్షల మంది భక్తులు

వివరాలు 2లో..

## సీఎం కుర్చీ కోసం కర్ణాటకలో కాంగ్రెస్ ఆట.. బీజేపీ వ్యంగ్య పోస్టు

- ఏఐ జెనరేటెడ్ వీడియో షేర్ చేసిన బీజేపీ
- నవంబర్ విప్లవం కోసం కౌంట్ డౌన్ మొదలైందంటూ క్యాప్షన్
- కర్ణాటకలో సీఎం మార్పు ఉంటుందన్న వార్తలపై బీజేపీ ఎద్దేవా

పెన్ పవర్ డెస్క్:కర్ణాటక ప్రభుత్వంలో 'నవంబర్ విప్లవం' చోటుచేసుకోనుందని, దీనికోసం ఇప్పటికే కౌంట్ డౌన్ ప్రారంభమైందని బీజేపీ వ్యంగ్యంగా ట్వీట్ చేసింది. ముఖ్యమంత్రి కుర్చీ కోసం కాంగ్రెస్ పార్టీలో పలువురు నేతలు 'మ్యూజికల్ చెయిర్' ఆట ఆడుతున్నారని ఎద్దేవా చేసింది. ఈ నెలతో కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తికావొస్తోంది.




వివరాలు 2లో..

## అంతరిక్షంలో ఏఐ డేటా సెంటర్లు.. గూగుల్ సంచలన ప్రకటన!



- అంతరిక్షంలో ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటుకు గూగుల్ శ్రీకారం
- 'ప్రాజెక్ట్ సన్‌క్యాచర్' పేరుతో కొత్త పరిశోధన కార్యక్రమం
- సౌరశక్తితో పనిచేయనున్న టీపీయూ ఆధారిత శాటిలైట్లు
- 2027 నాటికి రెండు ప్రయోగాత్మక ఉపగ్రహాల ప్రయోగం
- ఏఐ భారీ విద్యుత్ అవసరాలకు ప్రత్యామ్నాయ మార్గం
- భూమిపై వనరుల భారాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యం

పెన్ పవర్ డెస్క్:టెక్నాలజీ దిగ్గజం గూగుల్ మరో భారీ ప్రయోగానికి తెరతీ సింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోసం ఏకంగా అం తరిక్షంలోనే డేటా సెంటర్లను నిర్మించేందుకు పరిశోధనలు ప్రారంభించినట్లు సంచలన ప్రకటన చేసింది.

వివరాలు 2లో..

## తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే టీవీకే పోరు...
### సీఎం అభ్యర్థిగా హీరో విజయ్



- 2026 ఎన్నికలపై విజయ్ పార్టీ కీలక నిర్ణయం
- సీఎం అభ్యర్థిగా దళపతి!
- మహాబలిపురంలో జరిగిన జనరల్ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం
- డీఎంకే, బీజేపీ ప్రభుత్వాలు విఫలమయ్యాయంటూ విమర్శలు
- మొత్తం 12 కీలక రాజకీయ తీర్మానాలకు ఆమోదం
- ఎన్నికల పొత్తులపై తుది నిర్ణయం విజయ్‌దేనని స్పష్టీకరణ

పెన్ పవర్ డెస్క్:తమిళనాడు రాజకీయాల్లో గత కొన్ని వారాలుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. నటుడు విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీ 2026 అసెంబ్లీ ఎన్నికల బరిలో ఒంటరిగానే

వివరాలు 2లో..

## ప్రజల ప్రాణాలంటే చంద్రబాబుకు లెక్కలేదా?



- కాశీబుగ్గ ఘటన ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్న బొత్స
- ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మరల్చేందుకే డైవర్షన్ పాలిటిక్స్ అని విమర్శ
- నకిలీ మద్యం కేసులో టీడీపీ నేతలపై ఎందుకు చర్యలు లేవని ప్రశ్న

వివరాలు 2లో..

# ఎడిటర్ వ్యూ

## హర్యానాలో ప్రతీ 8 ఓటర్లలో ఒకరు ఫేక్..

- మొదటి పేజి తరువాయి

లైవ్ ఏర్పాటు చేసి హర్యానా ఎన్నికల్లో అక్రమాలకు సంబంధించిన వివరాలను ప్రదర్శిస్తూ వివరించారు. హర్యానాలోని ప్రతీ ఎనిమిది మంది ఓటర్లలో ఒకరు ఫేక్ ఓటరేనని రాహుల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో మొత్తంగా 12.5 శాతం మంది ఫేక్ ఓటర్లు ఉన్నారని తెలిపారు. బ్రెజిల్ కు చెందిన మోడల్ ఒకరు హర్యానా ఎన్నికల్లో సీమ, స్వీటీ, సరస్వతి పేరుతో మూడుసార్లు ఓటేసిందని ఆయన చెప్పారు. ఒకే మహిళ, ఒకే ఫొటోతో వేర్వేరు పోలింగ్ బూత్ లలో వంద ఓట్లు వేసిందన్నారు. రాహుల్ గాంధీ సాక్ష్యాలతో పాటుగా ఈ ఆరోపణలు చేశారు. ఓటర్ జాబితాలోని తప్పులను స్క్రీన్ పై ప్రదర్శిస్తూ.. పోలింగ్ సందర్భంగా బూత్ లెవల్ నుంచే అక్రమాలు జరిగాయని చెప్పారు. ఎలక్షన్ కమిషన్ తలుచుకుంటే ఓటర్ జాబితాలోని ఈ అక్రమాలను కేవలం క్షణాల వ్యవధిలో తొలగించగలదని అన్నారు. అయితే, కేంద్రంలోని బీజేపీకి ఈసీ వంతపాడుతూ అక్రమాలకు కొమ్ముకాస్తోందని రాహుల్ తీవ్ర విమర్శలు చేశారు. ఇటీవల హర్యానాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 25 లక్షల ఓట్ల చోరీ జరిగిందని ఆరోపించారు. ఓటు హక్కు నమోదుకు హౌస్ నెంబర్ తప్పనిసరి కావడంతో ఇళ్లు లేని నిరుపేదలకు ఇబ్బంది కలుగుతోందని ఈసీ ఓ కొత్త రూల్ తీసుకొచ్చిందని రాహుల్ గుర్తు చేశారు. ఇల్లు లేని నిరుపేదలు ఓటు హక్కు నమోదు సమయంలో ఇంటి నెంబర్ ను 'జీరో' గా పేర్కొనే వెసులుబాటు కల్పించిందని చెప్పారు. అయితే, ఈ విధానం వెనక నిరుపేదలకు ఓటు హక్కు కల్పించాలనే సదుద్దేశం కన్నా అక్రమ ఓటర్లు, ఫేక్ ఓటర్లకు జాబితాలో చోటు కల్పించాలనే దురుద్దేశమే ఉందని రాహుల్ విమర్శించారు. ఎన్నికల జాబితాలో ఇంటి నెంబర్ జీరోగా పేర్కొన్న పలు ఓటర్ల ఇళ్లను తన టీమ్ ప్రత్యక్షంగా వెళ్లి పరిశీలించిందని ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలో జరిపిన ఈ పరిశీలనలో సంచలన విషయాలు బయటపడ్డాయని రాహుల్ చెప్పారు. ఇంటి నెంబర్ జీరోగా పేర్కొన్న ఓ నిరుపేద ఇల్లు ఇదేనంటూ స్క్రీన్ పై ఓ భారీ భవంతిని చూపించారు. ఇంత పెద్ద భవనానికి ఇంటి నెంబర్ లేదని, ఈ ఇంటి యజమాని పేరు సహా పలువురు అక్రమార్కులకు ఇదే విధంగా ఓటు హక్కు కల్పించారని రాహుల్ గాంధీ ఆరోపించారు.

## తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే టీవీకే పోరు...

- మొదటి పేజి తరువాయి

దిగనున్నట్లు బుధవారం అధికారికంగా ప్రకటించింది. పార్టీ వ్యవస్థాపకుడైన విజయ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. మహాబలిపురంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో విజయ్ అధ్యక్షతన జరిగిన పార్టీ ప్రత్యేక జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,000 మందికి పైగా జనరల్ కౌన్సిల్ సభ్యులు, జిల్లా కార్యదర్శులు, ఇతర ముఖ్య నాయకులు హాజరయ్యారు. సెప్టెంబర్ 27న కరూర్ ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో మరణించిన 41 మందికి నివాళిగా రెండు నిమిషాల మౌనం పాటించి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ విషాద ఘటన తమకు ఒక బాధాకరమైన గుణపాఠం అని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కఠినమైన భద్రతా చర్యలు తీసుకుంటామని పార్టీ పేర్కొంది.

ఈ సమావేశంలో రాబోయే ఎన్నికలే లక్ష్యంగా పార్టీ రాజకీయ, విధానపరమైన వైఖరిని స్పష్టం చేస్తూ మొత్తం 12 తీర్మానాలను ఆమోదించారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రక్రియ వల్ల అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆరోపించారు. శ్రీలంక నౌకాదళం పదేపదే తమిళ మత్స్యకారులను అరెస్ట్ చేస్తున్నా, రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమిళుల ప్రయోజనాలను కాపాడడంలో పూర్తిగా విఫలమయ్యాయని టీవీకే విమర్శించింది. తమిళనాడులో శాంతిభద్రతలు దారుణంగా క్షీణించాయని ఆరోపిస్తూ, కోయంబత్తూరు కళాశాల విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి ఘటనను ఉదాహరణగా చూపింది. మహిళల భద్రత కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మండిపడింది. అదేవిధంగా, ధాన్యం సేకరణలో జాప్యం కారణంగా డెల్టా రైతులు పడుతున్న ఇబ్బందులపై, పంట పొలాల్లోనే మొలకెత్తుతున్న వరిపై ఆందోళన వ్యక్తం చేసింది. చిత్తడి నేలల ఆక్రమణలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించింది. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులు, ఉద్యోగ కల్పనపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఇక, ఎన్నికల పొత్తులకు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్నా ఆ అధికారం కేవలం విజయ్‌కు మాత్రమే ఉంటుందని, 2026 ఎన్నికల్లో తమ పార్టీ సొంత కూటమికి నాయకత్వం వహిస్తుందని తీర్మానాల్లో స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, భద్రతా కారణాల దృష్ట్యా సమావేశ వేదిక వద్ద ఏర్పాటు చేసిన పార్టీ బ్యానర్లు, జెండాలను పోలీసులు తొలగించారు.

## ఫొటోల కోసం బురద లేని పొలంలో మట్టి అంటకుండా జగన్ పర్యటించారు

- మొదటి పేజి తరువాయి

విరుచుకుప డ్డారు. అది రైతులను పరామర్శించేందుకు చేసిన యాత్ర కాదని, ఎన్నికల్లో ఓడించారన్న అక్కసుతో వారిపైకి చేసిన దండయాత్ర అని ఆయన ఘాటుగా విమర్శించారు. రైతులపై ప్రేమ ఉంటే కట్ట మీద పొలాలున్న ప్రాంతంలో పర్యటించాలని సవాల్ విసిరారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... వందల కార్లు, బైక్‌లు, పెయిడ్ ఆర్టిస్టులతో మందీ మార్బలంతో పరామర్శకు వెళ్లిన ఏకైక నాయకుడు జగన్ అని ఎద్దేవా చేశారు. రైతుల వద్దకు పరామర్శకు వెళ్లి పూలు చల్లించుకోవడం ఏమిటని ప్రశ్నించారు. జగన్ పర్యటన చూస్తే ఆనందంతో వెళ్లినట్లు ఉంది తప్ప, రైతుల బాధలు పంచుకోవడానికి వెళ్లినట్లు లేదని వ్యాఖ్యానించారు. అసలు తుపాను సమయంలో జగన్ ఎక్కడున్నారని వెంకన్న నిలదీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, లోకేశ్ రాత్రింబవళ్లు క్షేత్రస్థాయిలో ఉండి ప్రజలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. చంద్రబాబు తుపాను హెచ్చరికల సమయం నుంచే యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారని, నష్టాన్ని తగ్గించేందుకు కృషి చేశారని తెలిపారు. వ్యవసాయం గురించి జగన్‌కు ఏం తెలుసని బుద్దా వెంకన్న ప్రశ్నించారు. "నీ తాతది గ్రానైట్, నీ తండ్రిది ఫ్యాక్షన్, నీది దగా వ్యాపారం" అంటూ వ్యక్తిగత విమర్శలు చేశారు. కేవలం ఫొటోల కోసం బురద లేని పొలంలో మట్టి అంటకుండా జగన్ పర్యటించారని సెటైర్లు వేశారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పొలంలో అడుగుపెట్టని వ్యక్తి, ఇప్పుడు డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. చంద్రబాబు పడి లేచిన కెరటం వంటి వారని, అలాంటి నేతకు వార్నింగ్ ఇచ్చే అర్హత, స్థాయి జగన్‌కు ఉన్నాయా? అని మండిపడ్డారు. జగన్ విధ్వంసకర పాలన అందించారు కాబట్టే ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసి ఇంట్లో కూర్చోబెట్టారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా జగన్ ఇలాంటి దండయాత్రలు మానుకుని ప్రజల కోసం పనిచేయాలని హితవు పలికారు.

## కూటమి ప్రభుత్వంలోనే రైతుకు న్యాయం

- మొదటి పేజి తరువాయి

టన్నుల గోధుమపిండిని సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. నవంబర్ మాసంలో వర్ష సూచన ఉన్న నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు 50 వేల టార్పాలిన్‌లను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఈ-క్రాప్‌లో పంట నష్టాన్ని నమోదు చేస్తే ప్రభుత్వం ధాన్యం కొనదంటూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దాన్ని ఎవరూ నమ్మవద్దని మంత్రి కోరారు. ఈ-క్రాప్‌లో నమోదైన ప్రతి గింజనూ నూటికి నూరు శాతం కొనుగోలు చేసి తీరుతామని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ఇప్పటికే 39.51 లక్షల ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తయిందని, 85 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై కార్పొరేషన్ వైస్ చైర్మన్-ఎండీ ఢిల్లీ రావు, డైరెక్టర్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

# అంతరిక్షంలో ఏఐ డేటా సెంటర్లు.. గూగుల్ సంచలన ప్రకటన!

- మొదటి పేజి తరువాయి

'ప్రాజెక్ట్ సన్‌క్యాచర్' పేరుతో ఈ 'మూన్‌షాట్' కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించింది. భవిష్యత్తులో ఏఐ కంప్యూటింగ్ సామర్థ్యాన్ని విస్తరించడంలో ఈ ప్రాజెక్ట్ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టనుందని కంపెనీ భావిస్తోంది.

ఈ ప్రాజెక్టులో భాగంగా, గూగుల్ తన టెన్సర్ ప్రాసెసింగ్ యూనిట్స్ (టీపీయూ)లను అంతరిక్షంలోకి పంపనుంది. సౌరశక్తితో పనిచేసే చిన్నపాటి ఉపగ్రహాల సమూహాన్ని ఏర్పాటు చేసి, వాటి ద్వారా ఏఐ డేటా సెంటర్లను నడపాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఉపగ్రహాలను ఒకదానికొకటి ఫ్రీ-స్పేస్ ఆప్టికల్ లింక్స్ ద్వారా అనుసంధానిస్తారు. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ అంతరిక్షంలో భారీ డేటా సెంటర్లు రానున్నాయని అంచనా వేసిన కొన్ని వారాలకే గూగుల్ నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం. ఈ సందర్భంగా గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ మాట్లాడుతూ.. "మా టీపీయూలు అంతరిక్షంలోకి వెళ్తున్నాయి. క్వాంటం కంప్యూటింగ్, అటానమస్ డ్రైవింగ్ లాంటి మా మూన్‌షాట్ ప్రాజెక్టుల స్ఫూర్తితో 'ప్రాజెక్ట్ సన్‌క్యాచర్'ను ప్రారంభించాం. సౌరశక్తిని పూర్తిస్థాయిలో వినియోగించుకుని అంతరిక్షంలో ఏఐ వ్యవస్థలను ఎలా నిర్మించవచ్చో అన్వేషిస్తున్నాం" అని తెలిపారు. 2027 ప్రారంభం నాటికి ప్లానెట్ సంస్థ భాగస్వామ్యంతో రెండు ప్రయోగాత్మక ఉపగ్రహాలను ప్రయోగించడమే తమ తదుపరి లక్ష్యమని ఆయన వివరించారు.

**అంతరిక్షంలోనే ఎందుకు?**

ఏఐ అల్గారిథమ్‌లకు అపారమైన విద్యుత్ శక్తి అవసరం. భూమిపై ఈ విద్యుత్ అవసరాలు పర్యావరణంపై భారం మోపుతున్నాయి. దీనికి పరిష్కారంగా గూగుల్ అంతరిక్షాన్ని ఎంచుకుంది. భూమి మీద కంటే అంతరిక్షంలోని సరైన కక్ష్యలో ఉండే సోలార్ ప్యానెల్ 8 రెట్లు ఎక్కువ సామర్థ్యంతో పనిచేస్తుంది. దాదాపు నిరంతరాయంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయగలదు. బ్యాటరీల అవసరం కూడా తగ్గుతుంది. భూమిపై

వనరుల వినియోగాన్ని తగ్గించి, ఏఐ పూర్తి సామర్థ్యాన్ని వాడుకోవాలంటే అంతరిక్షమే సరైన ప్రదేశమని గూగుల్ తన ప్రకటనలో పేర్కొంది. అయితే, ఈ ప్రాజెక్టులో రేడియేషన్, థర్మల్ మేనేజ్‌మెంట్, సిస్టమ్ విశ్వసనీయత వంటి అనేక సాంకేతిక సవాళ్లు ఉన్నాయి. ఇప్పటికే తమ ట్రిలియం-జనరేషన్ టీపీయూలు భూమికి సమీప కక్ష్యలోని రేడియేషన్‌ను తట్టుకోగలవని ప్రయోగాల్లో తేలినట్లు గూగుల్ తెలిపింది. ఈ సవాళ్లను అధిగమించి, భవిష్యత్తులో అంతరిక్ష ఆధారిత ఏఐ మౌలిక సదుపాయాలను నిర్మించే దిశగా గూగుల్ తన పరిశోధనలను ముమ్మరం చేస్తోంది.

# ప్రజల ప్రాణాలంటే చంద్రబాబుకు లెక్కలేదా?

వైసీపీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఏపీలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతుల సమస్యలు, కాశీబుగ్గ తొక్కిసలాట ఘటన వంటి పలు అంశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఆయన ఎండగట్టారు. ప్రకృతి విపత్తులతో రైతులు తీవ్రంగా నష్టపోతే ప్రభుత్వం నుంచి కనీస భరోసా కరవైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడిన బొత్స, తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. "వైసీపీ హయాంలో రైతులకు గిట్టుబాటు ధర, సబ్సిడీ అందించడంతో పాటు పంటల బీమా ప్రీమియంను కూడా ప్రభుత్వమే చెల్లించింది. కానీ ఈ ప్రభుత్వం ఆ భారాన్ని రైతులపైనే మోపుతోంది. ఇప్పటివరకు పంట నష్టంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. సీఎం, మంత్రుల మాటలు తప్ప చేతల్లో ఏమీ కనిపించడం లేదు" అని విమర్శించారు. రైతుల పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

కాశీబుగ్గ ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనపై బొత్స తీవ్రంగా స్పందించారు. అది ప్రైవేట్ ఆలయమని చెప్పడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. "ఎక్కువ మంది భక్తులు వస్తారని అంచనా వేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? ప్రజల ప్రాణాలంటే చంద్రబాబుకు లెక్కలేదా?" అని నిలదీశారు. తిరుపతి, సింహాచలం ఘటనల నుంచి ప్రభుత్వం ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలు బయటపడిన ప్రతిసారీ ఏదో ఒక అంశాన్ని తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని మరల్చడం కూటమి ప్రభుత్వానికి అలవాటుగా మారిందని బొత్స ఆరోపించారు. నకిలీ మద్యం కేసులో

టీడీపీ నేత జయచంద్రారెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. గతంలో డ్రగ్స్ కేసులోనూ టీడీపీ నేతలను వదిలేశారని గుర్తుచేశారు. ఇదే సమయంలో ఎల్లో మీడియాను చూస్తుంటే నవ్వాలో, ఏడవాలో అర్థం కావడం లేదంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. భోగాపురం విమానాశ్రయం విషయంలో నిర్మాణానికి అవసరమైన అప్రోచ్ రోడ్లు, ఇతర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. రైతులు, వైద్యం, విద్య, భక్తుల భద్రత వంటి ఏ అంశంలోనూ ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బొత్స విమర్శించారు.

# తెలంగాణ సరిహద్దు సమీపంలో కాల్పుల మోత... ముగ్గురు మావోయిస్టుల మృతి

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్ ముమ్మరంగా సాగుతోంది. బీజాపూర్ జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య బుధవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మరణించినట్లు సమాచారం. తెలంగాణ సరిహద్దుకు సమీపంలోని తార్లగూడ ప్రాంతంలో ఈ ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి.

వివరాల్లోకి వెళితే... అన్నారం, మరిమల్ల గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలపై నిఘా వర్గాల నుంచి పక్కా సమాచారం అందింది. దీంతో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) బృందాలు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు తారసపడటంతో ఇరువర్గాల మధ్య కాల్పులు మొదలయ్యాయి. ఈ ఆపరేషన్‌లో ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను, కొన్ని ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. అయితే, దీనిపై అధికారికంగా పూర్తి ప్రకటన వెలువడాల్సి ఉంది. బుధవారం సాయంత్రం నాటికి కూడా ఆపరేషన్ కొనసాగుతూనే ఉందని అధికారులు వెల్లడించారు. "బీజాపూర్ ప్రాంతంలో ఆపరేషన్ కొనసాగుతోంది, పరిస్థితి సాధారణంగానే ఉంది. ఆపరేషన్‌కు సంబంధించిన కీలక వివరాలను తగిన సమయంలో అందిస్తాం" అని మధ్యాహ్నం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఈ ఘటనపై స్పందిస్తూ, హతమైన మావోయిస్టులు అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పనిచేస్తున్న స్థానిక కమిటీలకు చెందినవారై ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

**ముమ్మరంగా కూంబింగ్**

2026 మార్చి నాటికి దేశం నుంచి మావోయిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవలే ప్రకటించిన నేపథ్యంలో

భద్రతా బలగాలు ఆపరేషన్లను తీవ్రతరం చేశాయి. ఛత్తీస్‌గఢ్‌లో 2024 జనవరిలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు 2,100 మంది మావోయిస్టులు లొంగిపోగా, 1,785 మందిని అరెస్ట్ చేశారు. వివిధ ఆపరేషన్లలో 477 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఒకవైపు సైనిక చర్యలు కొనసాగిస్తూనే, మరోవైపు 'ఆత్మసమర్పణ్ ఏవం పునర్వాస్ నీతి 2025', 'నియాద్ నెల్ల నార్ యోజన' వంటి పథకాల ద్వారా లొంగిపోయిన వారికి పునరావాసం కల్పిస్తూ ప్రభుత్వం ద్వంద్వ వ్యూహాన్ని అమలు చేస్తోంది.

# రైలు ఢీకొని ఆరుగురు భక్తుల మృతి

ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌లో ఘోర విషాదం చోటుచేసుకుంది. చునార్ రైల్వే స్టేషన్‌లో బుధవారం ఉదయం వేగంగా వెళ్తున్న రైలు కిందపడి ఆరుగురు భక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనలో మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. కార్తిక పౌర్ణమి పుణ్యస్నానాల కోసం వారణాసికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. చోపాన్ నుంచి ప్రయాగ్‌రాజ్ వెళ్లే ప్యాసింజర్ రైలు (13309) చునార్ స్టేషన్‌లోని 4వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఆగింది. ఈ రైలులో వచ్చిన భక్తులు, ఫుట్ ఓవర్‌బ్రిడ్జిని ఉపయోగించకుండా, పట్టాలు దాటి 3వ నంబర్ ప్లాట్‌ఫామ్‌కు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఉదయం సుమారు 9:30 గంటల సమయంలో అదే ట్రాక్‌పై వేగంగా వస్తున్న నేతాజీ ఎక్స్‌ప్రెస్ (కల్కా మెయిల్,12311) వారిని బలంగా ఢీకొట్టింది. ఆ రైలుకు చునార్ స్టేషన్‌లో హాల్ట్ లేదు. దీంతో భక్తులు తప్పించుకునే అవకాశం లేకుండా పోయింది. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మరణించగా, పలువురి శరీర భాగాలు ఛిద్రమయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్టేషన్‌లో గందరగోళం నెలకొంది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది, స్థానిక పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వారణాసి జోన్ ఏడీజీ పీయూష్ మోర్డియా ఆరుగురు మరణించినట్లు ధృవీకరించారు. ఈ ప్రమాదం కారణంగా చునార్ జంక్షన్‌లో రైళ్ల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగలేదని నార్త్ సెంట్రల్ రైల్వే జోన్ అధికారులు తెలిపారు. ఈ దుర్ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సహాయక చర్యలను వేగవంతం చేయాలని, వెంటనే ఘటనా స్థలానికి చేరుకోవాలని సీనియర్ అధికారులను ఆదేశించారు. సహాయక చర్యల్లో పాల్గొనాలని ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, బాధితుల కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అధికారులు మృతుల వివరాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

# 'వసంతం-2025' వస్త్ర ప్రదర్శన ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్...

విజయవాడ నగరంలోని ఎంజీ రోడ్డులో ఉన్న శ్రీ శేషసాయి కల్యాణ వేదికలో ఏర్పాటు చేసిన 'వసంతం-2025' చేనేత, చేతివృత్తుల ప్రదర్శనను రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ బుధవారం ప్రారంభించారు. క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన సహజ రంగులతో తయారుచేసిన 'కొత్తూరు వసంత వర్ణ' అనే నూతన చేనేత బ్రాండ్‌ను ఆవిష్కరించారు. ఈ ప్రదర్శనలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత కళాకారులు, చేతివృత్తుల వారు రూపొందించిన ఉత్పత్తులను 70కి పైగా స్టాళ్లలో ప్రదర్శనకు ఉంచారు. ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం మంత్రి లోకేశ్ అక్కడి స్టాళ్లను సందర్శించి, ఉత్పత్తులను పరిశీలించారు. కళాకారులతో మాట్లాడి వారి నైపుణ్యాన్ని అభినందించారు.

దీనిపై మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియాలో స్పందిస్తూ, "క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను ప్రారంభించడం సంతోషంగా ఉంది. ఇక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించాను. మన కళాకారుల ప్రతిభ అద్భుతంగా ఉంది. ప్రకృతి సహజసిద్ధ రంగులతో తయారుచేసిన 'కొత్తూరు వసంత వర్ణ' బ్రాండ్‌ను ఆవిష్కరించడం ఆనందదాయకం" అని తెలిపారు. చేనేత కళకు, చేతివృత్తుల వారికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

# సీఎం కుర్చీ కోసం కర్ణాటకలో కాంగ్రెస్ ఆట.. బీజేపీ వ్యంగ్య పోస్టు

- మొదటి పేజి తరువాయి

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మెజారిటీ సాధించిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ఏర్పాటులో తీవ్ర తాత్సారం చేసిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి పీఠం కోసం సీనియర్ నేతలు సిద్దరామయ్య, డీకే శివకుమార్ లు పట్టుబట్టడం వల్లే ప్రభుత్వ ఏర్పాటు ఆలస్యమైందని అప్పట్లో ప్రచారం జరిగింది. దీంతో హైకమాండ్ మధ్యేమార్గంగా చెరో రెండున్నర సంవత్సరాలు సీఎం సీటును పంచుకోవాలంటూ ఇరువురు నేతలకు రాజీ కుదర్చినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరిగింది. తాజాగా రెండున్నర సంవత్సరాలు పూర్తికావొస్తుండడంతో ఈ ఒప్పందం ప్రకారం ముఖ్యమంత్రి మార్పు జరగనుందని తాజాగా వార్తలు వెలువడుతున్నాయి. ఒప్పందం ప్రకారం ముఖ్యమంత్రి పదవిని డీకే శివకుమార్ కు అప్పగిస్తారని కర్ణాటకకు చెందిన కొంతమంది నేతలు అభిప్రాయపడుతున్నారు. అయితే, సీఎం కుర్చీని వదులుకునేందుకు సిద్దరామయ్య అంగీకరించడంలేదని, పూర్తికాలం తానే పదవిలో కొనసాగుతానని పేచీ పెడుతున్నారని సమాచారం. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో తప్పుకోవాల్సి వస్తే తాను సూచించిన వ్యక్తికే సీఎం కుర్చీ అప్పగించాలని హైకమాండ్ ఎదుట డిమాండ్ పెట్టినట్లు సమాచారం. ఈ వార్తలపై బీజేపీ వ్యంగ్యంగా స్పందించింది. కర్ణాటకలో ప్రభుత్వ పెద్దలు ప్రజల సమస్యలను పక్కన పెట్టి కుర్చీ కోసం కొట్లాడుతున్నారని తీవ్ర విమర్శలు చేసింది. ముఖ్యమంత్రి పీఠం కోసం కాంగ్రెస్ పార్టీలో పలువురు నేతలు మ్యూజికల్ చెయిర్ ఆట ఆడుతున్నారని ఆరోపించింది. ఏఐ సాయంతో ఓ వీడియో తయారు చేసి పార్టీ అధికారిక ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# తిరుమల లడ్డూ ప్రసాదంలో నాణ్యత పెంచాం

- మొదటి పేజి తరువాయి

అన్న ప్రసాదాలు స్వీకరిస్తున్నారు. లడ్డూ ప్రసాదంలో కూడా చాలా మార్పులు వచ్చాయి. ప్రసాదాలు పది రోజులైనా నిల్వ ఉంటున్నాయని భక్తులు చెబుతున్నారు. తిరుపతి స్థానికులకు నెలకోసారి తొలి మంగళవారం 3వేల మందికి దర్శనం కల్పిస్తున్నాం. తిరుమలలోని కాటేజ్‌లకు గతంలో సొంత పేర్లు పెట్టుకున్నారు. వాటిని తొలగించి దేవుడి పేర్లు పెట్టాలని నిర్ణయించాం. మొదటి బోర్డు మీటింగ్‌లోనే అన్యమతస్థులను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నాం.. కొందరిని తొలగించాం. ఏఐ సాంకేతికత సాయంతో 2గంటల్లోనే భక్తులకు దర్శనం ఏర్పాటు చేయాలని అనుకున్నాం.. కానీ, ఒక వర్గం ఏఐపై వ్యతిరేకత వ్యక్తం చేసింది. నూతన ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఆధ్వర్యంలో మళ్లీ ఏఐ ప్రాజెక్టును పట్టాలెక్కిస్తున్నాం. తిరుమల కొండపై రాజకీయాలు మాట్లాడితే చర్యలు తీసుకోవాలని తీర్మానించాం. టూరిజం ప్యాకేజీలను రద్దు చేసి ఆ టికెట్‌లను సామాన్య భక్తులకు ఇస్తున్నాం.

**తితిదే పరిధిలోని ఆలయాల్లో నిత్యాన్నదానం...**

శ్రీనివాస సేతు పేరు బదులుగా తిరుపతి ఫ్లైఓవర్‌కు గరుడ వారధి అని పెట్టాం. కొండని ఆనుకొనివున్న స్థలంలో ముంతాజ్ హోటల్‌కి గత ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సీఎం చంద్రబాబు సహకారంతో ఆ హోటల్‌ను అక్కడి నుంచి తీసేయించి వేరే చోటికి మార్చాం. తిరుమలలో దాదాపు 1500 దుకాణాలకు ఇష్టా రాజ్యంగా అనుమతులు ఇచ్చారు. వాటన్నింటినీ క్రమబద్ధీకరిస్తున్నాం. బ్రేక్ దర్శనాలు మొన్నటి వరకు 10.30కి ఉండేవి.. ఇప్పుడు వాటిని తిరిగి తెల్లవారుజామునకి మార్చాం. అలిపిరి టోల్‌గేట్ వద్ద కొత్త సాంకేతికత ఏర్పాటు చేస్తున్నాం. శ్రీవాణి ట్రస్ట్ కింద 5వేల ఆలయాలు నిర్మించాలని తీర్మానించాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ఆలయాలు, భజన మందిరాలు నిర్మిస్తాం. తితిదేకు 100 ఎలక్ట్రిక్ బస్సులు ఇస్తామని కేంద్రమంత్రి కుమారస్వామి హామీ ఇచ్చారు. వాటిని తిరుపతి, తిరుమల మధ్య నడపాలి అనుకుంటున్నాం. తితిదే పరిధిలో ఉండే ఆలయాల్లో నిత్యాన్నదానం ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ప్రతి రాష్ట్ర రాజధానిలో వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే రెండు రాష్ట్రాలు రాజధానిలో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఆమోదం తెలిపాయి. ఒంటిమిట్టలో 100 గదుల వసతి గృహం నిర్మాణం చేయలని నిర్ణయించాం.

**కరీంనగర్, దుబ్బాకలో శ్రీవారి ఆలయాల నిర్మాణం..**

వెంకటేశ్వర గోశాల నిర్వహణ మెరుగుపరచడంపై నిపుణులతో కమిటీ ఏర్పాటు చేశాం. నివేదిక వచ్చిన తరువాత కార్యాచరణ ఉంటుంది. సిమ్స్ ఆసుపత్రిలో మెడికల్ మాఫియా నడుస్తుంది.. ఆసుపత్రే మెడికల్ షాప్స్ నిర్వహించాలని నిర్ణయించాం. తిరుపతి ఎయిర్‌పోర్టుకు శ్రీవెంకటేశ్వర ఎయిర్ పోర్ట్ అని నామకరణం చేయాలని కోరుతున్నాం. పేరుతో పాటు ఎయిర్ పోర్ట్‌ని ఆలయం సెట్ లాగా ఏర్పాటు చేస్తున్నాం. తిరుపతి ఎయిర్ పోర్ట్ అంటే వెంకటేశ్వర స్వామి ఆలయం గుర్తు వచ్చేలా తీర్చిదిద్దుతాం. తిరుమలపై అసత్య ప్రచారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. టికెట్ల జారీలో సైబర్ నేరాలకు పాల్పడిన వారిని తొలగించి.. సైబర్ సెక్యూరిటీ ల్యాబ్‌ని ఏర్పాటు చేశాం. అన్నమయ్య జన్మించిన తాళ్లపాకను అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. తితిదే కొనుగోళ్ల విభాగంలో జరిగిన అవకతవకలపై ఏసీబీ విచారణకు ఆదేశించాం. రూ.30 కోట్లతో కరీంనగర్‌లో, రూ.4.5 కోట్లతో దుబ్బాకలో శ్రీవారి ఆలయాలు నిర్మించనున్నాం" అని బీఆర్ నాయుడు తెలిపారు.

# ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ కు డాక్టరేట్...

- మొదటి పేజి తరువాయి

అని లోకేశ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజా సేవకు లభించిన గౌరవంగా దీనిని భావిస్తున్నట్లు ఆయన తన సందేశంలో తెలిపారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సుదీర్ఘకాలం సేవలు అందించిన జస్టిస్ అబ్దుల్ నజీర్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా కొనసాగుతున్నారు. ఇప్పుడు కర్ణాటక స్టేట్ లా యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకోవడం ఆయన న్యాయ సేవలకు లభించిన మరో ముఖ్యమైన గుర్తింపుగా భావిస్తున్నారు.

# టీడీపీ సభ్యుని కుటుంబంకు ప్రమాద బీమా అందజేత

**పెన్ పవర్ బ్యూరో బాపట్ల నవంబర్ 5**

కర్లపాలెం పంచాయతీలోని టీడీపీ పార్టీ కార్యకర్త కనమర్లపూడి అజయ్ కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా నామిని అయిన వారి అమ్మగారికి 5 లక్షలు రూపాయిల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ పార్టీ మండల అధ్యక్షులు ఏపూరి భూపతిరావు మాట్లాడుతూ పార్టీకి వెన్నంటి ఉండి నడిచిన వారిని కష్టకాలంలో టీడీపీ పార్టీ ఆదుకొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షేక్ బాజి, ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ బాష, జడ్పీటీసీ పిట్ల వేణు గోపాలరెడ్డి, కుమ్మరికుంట దాస్, బుల్లియ్య, పిట్ల వసంతరెడ్డి, కట్టా సుజాత, బొద్దుకురి విజయ తదితరులు పాల్గొన్నారు.



పెన్ పవర్
గుంటూరు । బాపట్ల । పల్నాడు

# రాష్ట్రాన్ని టెంపుల్ టూరిజం హబ్‌గా మార్చాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యం

*సకల దేవతల అనుగ్రహంతో రైతులకు మేలు జరిగితేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది.*

*బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై, సభ్యుల్ని అభినందించిన మాజీమంత్రి ప్రత్తిపాటి*







**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, నవంబర్ 05 :**

చిలకలూరిపేట : రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంతో పాటు, ఏపీని టెంపుల్ టూరిజానికి హబ్ గా మార్చాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానోద్దేశమని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. చిలకలూరిపేట మండలం బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి ఆలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన, తొలుత స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సభ్యులు, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

**సకల దేవతల అనుగ్రహంతో రైతాంగానికి మేలు కలగాలి..**

తిరుమల సహా పలు ప్రధానః ఆలయాలను కలుపుతూ ఆధ్యాత్మిక, పర్యాటక అనుభూతికి ప్రాధాన్య మిస్తూ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని ప్రత్తిపాటి తెలిపారు. ఆంజనేయస్వామి సహా సకల దేవతల అనుగ్రహం, ఆశీస్సులతో రాష్ట్ర రైతాంగానికి మేలు కలగాలని, అప్పుడే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ప్రత్తిపాటి ఆశాభావం వ్యక్తంచేశారు. పేరు ప్రతిష్టలతో పాటు విద్వత్తు, మహిమ గల బొప్పూడి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠకు ఎలాంటి మచ్చ లేకుండా, భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా నూతన ధర్మకర్తల మండలి నిబద్ధత, అంకితభావంతో పనిచేయాలని ప్రత్తిపాటి సూచించారు. ఆలయ ఛైర్మన్ సహా ధర్మకర్తల మండలి నియామకంలో కూటమిపార్టీలకు సమప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ఛైర్మన్ గా గుంటు కోటేశ్వరరావు, ధర్మకర్తలుగా పరుచూరి వెంకటేశ్వర్లు, అనిల్ , మర్రి శ్రీనివాసరావు, మద్దిరాల వెంకటేశ్వర్లు, కావూరి ముత్యాలమ్మ, రొంపిచర్ల జ్యోతి, కుంభా అనూష, కంభం పల్లి వెంకట సుకన్య, మురికిపూడి సంతోష్, తదితరులను నియమించడం జరిగిందని ప్రత్తిపాటి చెప్పారు. అంతరం వారిని సన్మానించి, అభినందనలు తెలిపారు. ప్రమాణ స్వీకారోత్సవంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, టీడీపీ నాయకులు అంబటి సోంబాబు, కోడె హనుమంతరావు , పూసల హరిబాబు, గుర్రం నాగపూర్ణ చంద్రరావు, తెలుగు మహిళా నాయకులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశంలోనే సూర్యలంక బీచ్ ఒక మంచి పర్యాటక బీచ్‌గా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ అధికారులకు సూచించారు




**పెన్ పవర్ బ్యూరో బాపట్ల నవంబర్ 5**




బుధవారం, సూర్యలంక బీచ్ పరిసర ప్రాంతాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల కురి సిన మొంధా తుఫాన్ కారణంగా సూర్య లంక బీచ్‌లో గుంటలు పడి, లోతు ఎక్కువగా ఉన్నందున పర్యాట కులను బీచ్ సందర్శనకు నిషేధించినందున, కార్తీక మాసం సందర్భంగా ప్రజల సముద్ర స్నానాల నిమిత్తం బీచ్ సందర్శనకు అనుమతి, ప్రస్తుత పరిస్థితుల పై ఆయన అధికారులను ఆరా తీశారు. ప్రస్తుత వాతా వరణ పరిస్థితులు మారినందున, ఇవే పరిస్థితుల కొనసాగితే రెండు రోజుల్లో బీచ్ లో ఏర్పడిన గుంతలు పూడిపోయి యదాస్థితికి వస్తుందని అధికారులు కలెక్టర్ కు వివరించారు. సూర్యలంక బీచ్ ను సర్వాంగ సుందరంగా ఉంచేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ అన్నారు. సూర్య లంక బీచ్ లో ఒక సమగ్ర నిర్మాణం జరగాలని ఆయన అన్నారు. సూర్యలంక బీచ్ లో గస్తీ కొరకు పర్యాటక మిత్ర సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఆ సిబ్బందిని గుర్తించేందుకు యూనిఫామ్ ఇవ్వాలని, వారు మాట్లాడుకునేందుకు వాకి టాకీలు అందించాలని ఆయన అన్నారు. సూర్యలంక బీచ్ లో వివిధ శాఖలు నిర్వహించే పనులను నిర్ణయించాలని, బీచ్ ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. సూర్యలంక బీచ్ లో ఉన్నటువంటి విద్యుత్ స్తంభాలకు సీసీ కెమెరాలు, పిఏ పరికరములు, లైట్లు ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాలను సూర్యలంక స్టేషన్ హౌస్ ఆఫీసర్ కు లింక్ చేయాలని, స్తంభాలకు ఏర్పరిచిన పరికరములు ఎల్లవేళలా పని చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సూర్యలంక బీచ్ లోని తుఫాను షల్టర్ ను పునరుద్ధరించి ఉపయోగంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. తుఫాను సంభవించి నప్పుడు ప్రజలను, మత్స్యకారులను కాపాడేందుకు కావలసిన లైఫ్ జాకెట్లు, టార్చ్ లైట్ లు, పవర్ స్ప్రాలు, తాళ్లు, బీచ్ బగీలు అన్ని అందుబాటులో ఉండాలని, కావలసిన పరికరంల కొరకు ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ డి పి ఓ కు సూచించారు. పరికరాలను కొనుగోలు చేయుటకు సిద్ధంగా ఉన్నామని, వాటి నిర్వహణను సమర్థంగా నిర్వహించాలని ఆయన అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, బాపట్ల టౌన్ డిఎస్పి రామాంజనేయులు, బాపట్ల తహసిల్దార్ సలీమా, సూర్యలంక స్టేషన్ హౌస్ ఆఫీసర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# అద్దంకి పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం







**అద్దంకి, నవంబర్ 5, అద్దంకి**


తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా బుధవారం అద్దంకిలోని పోతురాజు గండిలో గల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన తెదేపా నేతల సమావేశంలో పట్టణ కార్యవర్గాన్ని పార్టీ శ్రేణులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. తెలుగుదేశం పార్టీ అద్దంకి పట్టణ అధ్యక్షుడిగా అరిగల నాగరాజు , ఉపాధ్యక్షుడిగా దొప్పలపూడి ప్రసాద్ ,ప్రధాన కార్యదర్శి గా యనగండ్ల శ్రీనివాసరావు, కోశాధికారిగా మామిడి రాంబాబు ,కార్యనిర్వాహక కార్యదర్శులు గా ఇక్కుర్తి శ్రీనివాసరావు , షేక్ మహబూబ్ (మాబు),అద్దంకి ఏడుకొండలు, కార్యదర్శులుగా కన్నెబోయిన మణికంఠ, పప్పుల శ్రీనివాసరావు ,బండారు వెంకట రావు ,ఈ సందర్భంగా ఎంపిక కాబడిన నేతలు మాట్లాడుతూ పార్టీకి అటు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారం , పార్టీ మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కు, పట్టణ, వార్డులలోని నేతలందరికి అభినందనలు తెలిపారు.

# ఎన్ హెచ్ 65 విస్తరణ ప్రతిపాదనల్లో మార్పులు అవసరం

*ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎలివేటెడ్ కారిడార్ ఉత్తమం*

*ఎన్టీఆర్, కృష్ణ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ జి. లక్ష్మీశ, డి.కె.బాలాజీ*





**మచిలీపట్నం (పెన్ పవర్) నవంబర్ 05**

ఎన్ హెచ్ 16 తో ఎన్ హెచ్ 65 ను అనుసంధానించండి: ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, గద్దె రామ్మోహన్, వర్ల కుమార్ రాజా ఎన్ హెచ్ 65ను విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు ఆరు వరుసలుగా విస్తరించే ప్రతిపాదనల్లో మార్పులు అవసరమని ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల కలెక్టర్లు డాక్టర్ జి.లక్ష్మీశ, డి. కె.బాలాజీలు అభిప్రాయపడ్డారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఎన్టీఆర్, కృష్ణ జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో ఎన్ హెచ్ 65 విస్తరణ ప్రతిపాదనలపై ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజా ప్రతినిధులు, ఎన్ హెచ్ ఎ ఐ, మెట్రో రైల్ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ... ఎన్ హెచ్ 65 విస్తరణకు సంబంధించి మెట్రో అధికారులతో కలిసి మూడు ఆకృతులను (డిజైన్లను) సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రస్తుత ఆకృతి (డిజైన్) లో బెంజ్ సర్కిల్ నుంచి చినఓగిరాల వరకు ఉన్న ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించలేదని చెప్పారు. ప్రతిపాదించిన



వెహికల్ అండర్ పాస్ (వి యు సి) లు తక్కువగా ఉన్నాయని, వీటిని పెంచే అవకాశాలపై అధ్యయనం చేయాలన్నారు. కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ మాట్లాడుతూ... ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎలివేటెడ్ కారిడార్ ఉత్తమమన్నారు. విజయవాడ నగర శివారు ప్రాంతాల నుంచి ట్రాఫిక్ పెరుగుతుందని, పోర్ట్ ట్రాఫిక్ కూడా కలిస్తే మరింత రద్దీగా మారుతుందని, కనుక ఎలివేటెడ్ కారిడార్ పై దృష్టి సారించాలన్నారు. జనావాసాలు లేని చోట డ్రైనేజీలు నిర్మించలేదని, దీనివల్ల సమస్యల ఉత్పన్నమవుతున్నాయని చెప్పారు. ఓ ఆర్ ఆర్, మెట్రో ప్రాజెక్టులతో ఎన్ హెచ్ 65 విస్తరణను ముడి పెట్ట వద్దన్నారు. ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్, వర్ల కుమార్ రాజాలు.... ఎన్ హెచ్ 65ను ఎన్ హెచ్ 16 తో అనుసంధానించాలని, దీనికై మూడుచోట్ల రహదారులు నిర్మించాలని సూచించారు. వెహికల్ అండర్పాస్ ల ను పెంచాలని, రహదారి పై వీధిదీపాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. కొన్ని అండర్ పాస్ లలో నీరు నిలుస్తోందని దీనిపై ఎన్ హెచ్ ఏఐ అధికారులు దృష్టి సారించాలని చెప్పారు. అన్ని కూడళ్లలో బెల్ మౌత్ లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.ఇలక్కియ, కృష్ణాజిల్లా సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీ నరసింహం, విజయవాడ ఆర్డిఓ చైతన్య, ఎన్ హెచ్ ఏ ఐ పీడీ విద్యా సాగర్, మెట్రో రైలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్ విభాగంలో ఏ .పి టి డబ్ల్యూ. ఆర్. స్కూల్ విద్యార్థుల ప్రతిభ



**కారంపూడి, పెన్ పవర్, నవంబర్ 05 :**

పల్నాడు జిల్లా కారంపూడి మండలంలోని ఏపీ టి డబ్ల్యూ ఆర్ స్కూల్ విద్యార్థినిలు మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ స్కూల్లో ఘన విజయం సాధించిన ఏపీ టీ డబ్ల్యూ ఆర్ స్కూల్ విద్యార్థులు మొదటి స్థానం సంపాదించడం చాలా గర్వంగా ఉందన్నారు జిల్లా స్థాయికి కూడా సెలెక్ట్ కావడం జరిగిందని ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి మీడియాకు తెలిపారు. అండర్ 17 విభాగంలో 800 మీటర్లు మొదటి స్థానం సాధించిన విద్యార్థులు అథ్లెటిక్స్ విభాగంలో అండర్ 17, మరియు 800 మీటర్స్ మొదటి స్థానం కైవసం చేసుకున్న ఏ.పి. టి .డబ్ల్యూ .ఆర్ స్కూల్ ఎస్ జి ఎఫ్ ఐ గేమ్స్ నాలుగవ తారీకు జరిగిన అథ్లెటిక్స్ విభాగంలో ఏ. పి.టీ డబ్ల్యూ .ఆర్ .స్కూల్ విద్యార్థినీలు అండర్ 17 విభాగంలో 800 మీటర్స్ మొదటి స్థానం .1500 మీటర్లు రెండవ స్థానం బి. పూజ 9% విద్యార్థిని సాధించడం జరిగింది. 400 మీటర్స్ బి.దివ్య లాంగ్ జంప్ మూడవ స్థానం బి .స్వాతి డిస్టిక్ లెవెల్ కి సెలెక్ట్ కావడం జరిగింది. ఇందుకుగాను ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి గారు పి ఇ టి లు ప్రమీల, మెహరున్నిస ఇంకా ఉపాధ్యాయులు మరియు సిబ్బంది అభినందించారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

### ఆన్లైన్ డెలివరీ బాయ్‌కు తీవ్ర గాయాలు



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, నవంబర్ 05 :**

గణపవరం : గుంటూరు–చిలకలూరిపేట జాతీయ రహదారిపై గణపవరం, తిమ్మాపురం మధ్యలో గల పరంధామయ్య కంపెనీ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుంటూరు నుండి చిలకలూరిపేట వైపు వెళ్తున్న ఒక స్విఫ్ట్ డిజైర్ కారు (స్విఫ్ట్ డిజైర్ ) అదుపు తప్పి, ఒక్కసారిగా డివైడర్‌ను ఢీకొట్టి, అనంతరం ఒంగోలు నుండి గుంటూరు వైపు వెళ్లే మార్గంలోకి దూసుకెళ్లి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఆ మార్గంలో స్కూటీపై వెళ్తున్న ఓ ఆన్‌లైన్ డెలివరీ బాయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్కూటీ పూర్తిగా నుజ్జు నుజ్జు కాగా, కారు కూడా పూర్తిగా ధ్వంసమైంది. కారు నడుపుతున్న వ్యక్తికి మాత్రం స్వల్ప గాయాలైనట్లు సమాచారం. ప్రమాదం గురించి తెలియగానే, ఎడ్లపాడు ఎస్ఐ శివరామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన డెలివరీ బాయ్‌ను వెంటనే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. అనంతరం ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## బాపట్ల సూర్యలంక బ్రిడ్జి, బైపాస్ వద్దా కారు, బైక్, ఢీ – ఒకరు మృతి

**పెన్ పవర్ బ్యూరో బాపట్ల నవంబర్ 5**

కారు చీరాల బైపాస్ నుంచి వస్తూ ఉండగా సూర్యలంక బ్రిడ్జి వద్ద బాపట్లలోకి దిగే క్రమంలో ఈ యాక్సిడెంట్ జరిగిందని స్థానికులు తెలిపారు. బైక్ మీద వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. ఈ క్రమంలో చనిపోయిన వ్యక్తి పాదం పూర్తిగా కట్టడం జరిగింది. చనిపోయిన వ్యక్తి విమర్శెట్టి పాలన వాసిగా స్థానికులు చెబుతున్నారు.



# నగర స్వచ్ఛతలో ప్రతి పౌరుడి పాత్ర ఉండాలి...కమిషనర్ పులి శ్రీనివాసులు..

**పెన్ పవర్, గుంటూరు, నవంబర్, 05.**

ప్రతి ఇంటి నుండి వచ్చే వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేరు చేసి ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. బుధవారం కమిషనర్ రెడ్డిపాలెం, విజయపురి కాలనీ, అన్నపూర్ణ నగర్, హిమని నగర్, టెలికాం నగర్, రెడ్డిపాలెం, అరండల్ పేట ప్రాంతాల్లో పారిశుధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత రెడ్డిపాలెంలో స్థానికులతో మాట్లాడుతూ వ్యర్థాలను వేరు చేయడం ద్వారా రీసైక్లింగ్, కంపోస్టింగ్ వంటి పద్ధతులు సులభమవుతాయని, తద్వారా నగరంలో చెత్త నిల్వ సమస్యలు తగ్గుతాయన్నారు. ప్రజారోగ్య కార్మికులు కూడా తమకు కేటాయించిన మైక్రో ప్యాకెట్ల వారీగా అన్ని ఇళ్ల నుండి నూరు శాతం చెత్త సేకరణ చేయాలన్నారు. చెత్త సేకరణ విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని పర్యవేక్షణ మెరుగ్గా చేయాలని శానిటేషన్ కార్యదర్శులు, ఇన్స్పెక్టర్లకు స్పష్టం చేశారు. అనంతరం అరండల్ పేట మెయిన్ రోడ్ లో డ్రైన్ భవన వ్యర్థాలతో నిండి ఉండడం గమనించి



తక్షణం తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులను ఎం.బుక్ మేరకు పరిశీలించి, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా పనులు ప్రారంభం నుండి మెరుగైన పర్యవేక్షణ చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పనులు



పూర్తైన వెంటనే నిర్దేశిత విధానంలో ఎం.బుక్ రికార్డ్ చేయాలన్నారు. పర్యటనలో డి.ఈ.ఈ రమేష్, ఎస్ఎస్ లు ప్రసాద్, ఐజాక్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం

### - ఎమ్మెల్యే గళ్ళా మాధవి..



**పెన్ పవర్ గుంటూరు, నవంబర్, 05**

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి కార్యకర్తలతో ముఖాముఖి" కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ డివిజన్లకు చెందిన తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ...తెలుగుదేశం పార్టీ యొక్క నిజమైన బలం కార్యకర్తలే. మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు చెబుతూ ఉంటారు – పార్టీకి శక్తి, శ్వాస, ప్రాణం కార్యకర్తలే అని. అదే అక్షర సత్యం. కార్యకర్తలే పార్టీని బలంగా నిలబెడతారు. ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్త తన వ్యక్తిగత సమస్యలను నేరుగా నా దృష్టికి తీసుకొని రావటమే కార్యకర్తలతో ముఖాముఖి'



కార్యక్రమం ఉద్దేశం. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఆర్థిక, సామాజిక, కుటుంబ పరమైన అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. అటువంటి కార్యకర్తలు ఈరోజు నాతో స్వేచ్ఛగా మాట్లాడడం నాకు ఆనందంగా ఉంది. ఇకపై ప్రతి బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మా పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో ముఖాముఖి' కార్యక్రమం నిరంతరంగా నిర్వహిస్తాను. కార్యకర్తలతో నాకు ఎలాంటి దూరం ఉండకుండా చూసుకోవడం నా బాధ్యతగా భావిస్తున్నాను" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

# గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో రూ.2.66 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన - ఎమ్మెల్యే గళ్ళా మాధవి





**పెన్ పవర్, గుంటూరు, నవంబర్ 5**

గుంటూరు నగరంలోని పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి వేగం రోజురోజుకూ పెరుగుతోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం భాగ్యనగర్, వికాస్‌నగర్, ఎస్వీఎన్ కాలనీ, జేకేసీ రోడ్ ప్రాంతాలలో రూ.2 కోట్ల 66 లక్షల విలువైన రోడ్లు, డ్రైనేజీ, లైటింగ్ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి , మేయర్ కోవెలమూడి రవీంద్ర , జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ...భాగ్యనగర్ ప్రాంతం గతంలో వెనుకబడిన డివిజన్‌గా ఉండేది. ఇప్పుడు అన్ని మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టి, రోడ్లు, డ్రైన్లు, లైట్స్ వంటి పనులను దశలవారీగా పూర్తి చేస్తున్నాము. ప్రజల సహకారంతో ఈ ప్రాంతం కూడా అభివృద్ధి వైపు వేగంగా దూసుకెళ్తోంది అని తెలిపారు. ఈ రోజే 42వ డివిజన్‌లో వికాస్‌నగర్ మరియు ఎస్వీఎన్ కాలనీ ప్రాంతాలలో మొత్తం రూ.2.66 కోట్ల రూపాయల విలువైన పనులకు శంకుస్థాపన మరియు రూ.63 లక్షల రూపాయల రోడ్డు పనిని పూర్తి చేసి ప్రారంభించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి మరియు సంక్షేమం రెండు కళ్లలా ముందుకు సాగుతున్నాయి. అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో అన్ని సమస్యలకు పరిష్కారం చూపడానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఎస్వీఎన్ కాలనీ, జేకేసీ రోడ్ పరిసరాల్లో హెవీ లోడ్ టిప్పర్ల రాకపోకలతో ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారు గుర్తుచేశారు. ఈ సమస్య పరిష్కారానికి ఇప్పటికే స్థానిక కార్పొరేటర్ వేములపల్లి శివరామప్రసాద్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీని కోసం ట్రాఫిక్ సిఐ, డిఎస్పీ అధికారులను సంప్రదించి, అక్కడ నిరంతర పర్యవేక్షణకు ఒక కానిస్టేబుల్ లేదా ఎస్ఐని ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. "ఒక రెండు రోజుల్లోనే దానికి పరిష్కారం వస్తుంది. ప్రజల ఇబ్బందులను తగ్గించే దిశగా మేము నిరంతర కృషి చేస్తున్నాము" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు.

# జిల్లాలో జాతీయ రహదారుల పనులు తొందరగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల నవంబర్ 5**

జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణాలు పనులు (167. ఏ) తొందరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి జిల్లా కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఓడరేవు నుండి చిలకలూరిపేట యన్ హెచ్ 167 ఏ,నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ ప్రాజెక్టు మరియు ఇంటిగ్రేటెడ్ ఆక్వా ప్రాజెక్ట్ నిర్మాణ పనులకు సంబంధించి కి సంబంధించి యన్ హెచ్ అధికారులు, మత్స్య శాఖ అధికారులు ,ఆర్డీఓలు, తహశీల్దార్లు తో వీడియో కంట్రోల్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణాలు పనులు (167. ఏ) తొందరగా పూర్తి చేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు. ఓడరేవు నుండి చిలకలూరిపేట జాతీయ రహదారి–167 ఏ నిర్మాణానికి 88.38 హెక్టార్లలో భూమి సేకరించగా, మిగిలిన రెండు హెక్టార్లు త్వరగా సేకరించాలన్నారు. ఓడరేవు,చీరాల,కారంచేడు,పర్చూరు తహశీల్దార్లు ను ఆదేశించారు. నిజాంపట్నం ఫిషరీస్ హారబర్ అభివృద్ధి ప్రాజెక్టు సెకండ పేస్ – 2. కు సబందించి చేపట్టిన పనులు. 2026 మార్చి నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ ఆక్వా ప్రాజెక్టు దిండి గ్రామం నిజాంపట్నం ప్రాజెక్టు పనులు వెంటనే పూర్తి చేయాలని సంభందిత అధికారుల ను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టరేట్ ఏ ఓ.మల్లిఖార్జున రావు, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగం దినోత్సవ చెకుముకి పోటీలలో తిమ్మాపురం జడ్పీహెచ్ఎస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ.

### మండల,నియోజకవర్గ స్థాయి పోటీలలో ఫస్ట్ ప్లేస్.





**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, నవంబర్ 05**

ఎడ్లపాడు : మండల పరిధిలోని తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు చెకుముకి టాలెంట్ టెస్ట్ మరియు రాజ్యాంగ దినోత్సవ పోటీల్లో తమ ప్రతిభతో సత్తా చాటారు.చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు మండల స్థాయిలో మొదటి స్థానం సాధించారు. పదవ తరగతి విద్యార్థి కార్తీక్, తొమ్మిదో తరగతి విద్యార్థినులు లావణ్య లక్ష్మి, పి. నాగ వైష్ణవి సాయి చెకుముకి పోటీల్లో మండల స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచారు.రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రసంగ పోటీల్లో విద్యార్థి వి. క్రాంతి కుమార్ మండల స్థాయిలో మొదటి స్థానాన్ని, నియోజకవర్గ స్థాయిలో మూడవ స్థానాన్ని సాధించి పాఠశాలకు గౌరవం తీసుకువచ్చాడు.పల్నాడు జిల్లా స్థాయిలో కూడా తమ ప్రతిభను ప్రదర్శిస్తారని ఉపాధ్యాయులు నమ్మకం వ్యక్తం చేశారు.విజేతలకు ప్రధానోపాధ్యాయులు ఏ.వి. నాయుడు, ఉపాధ్యాయులు కె. ఎలీషా, ఎం. రాజేశ్వరి,ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

## ముందస్తు చికిత్స కోసం 3,50,000/- ఎల్ ఓ సి ను అందజేసిన శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, నవంబర్ 05 :**

చిలకలూరిపేట: పురుషోత్తపట్నం కి చెందిన దేవిరెడ్డి హనుమంతరావు కి ముందస్తు చికిత్స కోసం సీఎం సహాయనిధి నుండి 3,50,000 రూపాయల ఎల్ ఓ సి ను మాజీ మంత్రివర్యులు, నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అందజేశారు.అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ గత ప్రభుత్వం రోగుల్ని పట్టించుకోకుండా, సీఎంఆర్ఎఫ్ ని నిలిపేసి పేద ప్రజల మరణానికి కారణం అయ్యింది, కానీ కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్కరికి ఆలా జరగకూడదు అని సీఎంఆర్ఎఫ్ నిధుల్ని ప్రజలకు అందిస్తూ, వైద్యం చేయించుకోలేని వారికి ముందుగా ఎల్ ఓ సి ఇచ్చి వారి వైద్యానికి సహాయం చేసి కూటమి ప్రభుత్వం వారిని ఆదుకుంటున్నది అని మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు, ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బత్తినేని శ్రీనివాసరావు, దేవిరెడ్డి లక్ష్మి నారాయణ, బైరా శ్రీనివాసరావు, తోట పద్మావతి, పోతుల బాలాజీ, తదితరుల పాల్గొన్నారు.

# అద్దంకి పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం





**అద్దంకి, నవంబర్ 5, అద్దంకి :**
తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా బుధవారం అద్దంకిలోని పోతురాజు గండిలో గల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన తెదేపా నేతల సమావేశంలో పట్టణ కార్యవర్గాన్ని పార్టీ శ్రేణులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. తెలుగుదేశం పార్టీ అద్దంకి పట్టణ అధ్యక్షుడిగా అరిగల నాగరాజు , ఉపాధ్యక్షుడిగా దొప్పలపూడి ప్రసాద్ ,ప్రధాన కార్యదర్శి గా యనగండ్ల శ్రీనివాసరావు, కోశాధికారిగా మామిడి రాంబాబు ,కార్యనిర్వాహక కార్యదర్శులు గా ఇక్కుర్తి శ్రీనివాసరావు , షేక్ మహబూబ్ (మాబు),అద్దంకి ఏడుకొండలు, కార్యదర్శులుగా కన్నెబోయిన మణికంఠ, పప్పుల శ్రీనివాసరావు ,బండారు వెంకట రావు ,ఈ సందర్భంగా ఎంపిక కాబడిన నేతలు మాట్లాడుతూ పార్టీకి అటు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారం , పార్టీ మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కు, పట్టణ, వార్డులలోని నేతలందరికి అభినందనలు తెలిపారు.

## వాహనాలను అతివేగంగా నడప వద్దు..




**పెన్ పవర్ బ్యూరో బాపట్ల నవంబర్ 5**
మోటారు వాహనాలను నడిపేవారు పరిమిత వేగంతో నడపాలని.. ద్విచక్ర మోటార్ వాహనాలపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కర్లపాలెం ఎస్సై రవీంద్ర చెప్పారు. ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం కర్లపాలెం కూరగాయల మార్కెట్ వద్ద జాతీయ రహదారిపై ప్రజలకు అవగాహన కల్పించారు. రవీంద్ర మాట్లాడుతూ కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని అవగాహన కల్పించారు. పరిమిత వేగంతో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలను చేరుకోవాలని చెప్పారు.

## పలమనేరు బాలాజీకి 2025 ఈస్తటిక్స్ సాహిత్య పురస్కారం



**పలమనేరు, పెన్ పవర్, నవంబరు 05**
సాహిత్య రంగంలో ప్రతిష్టాత్మకమైన ఈస్తటిక్స్ జాతీయ సాహిత్య పురస్కారాన్ని స్థానిక కవి రచయిత పెద్దపంజాణి ఎంపీడీవో పలమనేరు బాలాజీ కవితా సంపుటి లోపలేదో కదులుతున్నట్టు కి ప్రకటించారు.ఇందుకు గాను 40వేల రూపాయల నగదు సహా
ఈస్తటిక్స్ జాతీయ సాహిత్య పురస్కారాన్ని నవంబరు 9వ తేదీ ఆదివారం ఖమ్మంలో జరిగే సాహిత్య కార్యక్రమంలో పలమనేరు బాలాజీ అందుకుంటారు ఇప్పటికి జాతీయ స్థాయిలో 90 కవితా సంపుటాలు పోటీకి రాగా పరిశీలన అనంతరం 40వేల రూపాయల ప్రధాన అవార్డును పలమనేరు బాలాజీకి ప్రకటిస్తున్నట్లు నిర్వాహకులు రవి మారుత్ (ఖమ్మం) తెలియజేశారని రచయిత తెలిపారు. కవి కథకుడు నవలాకారుడు విమర్శకుడిగా మూడున్నర దశాబ్దాలకు పైగా తెలుగు సాహిత్య రంగంలో కృషి చేస్తున్న పలమనేరు బాలాజి తన రచనలకు గాను ఇప్పటికీ రెండుసార్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీద రాష్ట్ర తెలుగు భాషా పురస్కారాన్ని పొందారు.కందుకూరి వీరేశలింగం పంతులు పురస్కారం,స్మైల్ పురస్కారం, నూతలపాటి గంగాధరం పురస్కారం ,తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం ,మాడభూషి రంగాచార్య స్మారక కథా పురస్కారం,గీతాంజలి స్మారక పురస్కారం, కెనడా తెలుగుతల్లి పురస్కారం,సడ్లపల్లి కథా పురస్కారాన్ని ఇప్పటివరకు అందుకున్నారు.

## ఈ క్రాప్ లో నమోదైన పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ పలు సూచనలు చేశారు.




**పెన్ పవర్ బ్యూరో బాపట్ల నవంబర్ 5**
ఈ క్రాప్ లో నమోదైన పంటను బుధవారం, కంకటపాలెం గ్రామంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సూపర్ చెక్ చేశారు. ఈ సందర్భంగా సర్వే నెంబర్ 2 లో ఈ క్రాప్ 5.9 వర్షన్, ఈ పంట యాప్ లో ఆన్లైన్ ద్వారా నమోదు చేసిన మన్నెం నిమ్మి కి చెందిన 3 ఎకరాల 19 సెంట్ల పొలంలో వేసిన వరి పైరును ఆయన పరిశీలించారు. మన్నెం నిమ్మి కి ఆయన ఫోన్ చేసి పంట వివరాలను తెలుసుకున్నారు. గ్రామంలో ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ గ్రామ సర్పంచ్ కి తెలిపారు. గ్రామంలో ఎవరు కూడా ఆరుబయట మలవిసర్జన చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. గ్రామంలో రెండు డొంకల్లో రోడ్డు ఏర్పాటు చేయాలని సర్పంచ్ జిల్లా కలెక్టర్ ను కోరగా, గ్రామంలో ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటే, రోడ్ల నిర్మాణం చేపడతామని ఆయన వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల మండల వ్యవసాయ అధికారి శారద, కంకటపాలెం సర్పంచ్ మద్దిరాల వందనం, వీఆర్ఓ సుధారాణి, వి ఏ ఏ షబీనా మరియు తదితరులు పాల్గొన్నారు.

# చిలకలూరిపేట బైపాస్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

## ఇద్దరు మహిళలు దుర్మరణం

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, నవంబర్ 05 :**
చిలకలూరిపేట : పట్టణ శివారులోని బైపాస్‌పై బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో రెండు కార్లు బలంగా ఢీకొన్న కారణంగా ఇద్దరు మహిళలు మృత్యువాత పడ్డారు. ప్రమాదంలో నుజ్జునుజ్జైన షిఫ్ట్ కారులో ప్రయాణిస్తున్నవారికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని చిలకలూరిపేట పట్టణంలోని ఆర్కే హాస్పటల్ వైద్యశాలకు తరలించారు. అయితే, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మహిళలు దుర్మరణం చెందారు. మృతులను ఈవూరి వారి పాలెం గ్రామానికి చెందిన కనపర్తి వరలక్ష్మి (70), అన్నం బొట్ల వారి పాలెం గ్రామానికి చెందిన చెరుకూరి జయలక్ష్మి (65)గా గుర్తించారు.ఈ ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# రిజిస్ట్రార్ కార్యాలయాలపై సీబీఐ దాడులు

## చిలకలూరిపేటలో కీలక మలుపు



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, నవంబర్ 05**
చిలకలూరిపేట: రాష్ట్రవ్యాప్తంగా అవినీతిపై ఉక్కుపాదం మోపుతూ సీబీఐ అధికారులు బృందాలుగా విడిపోయి రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మెరుపు దాడులు నిర్వహించారు. మొత్తం 120 నియోజకవర్గాల పరిధిలోని రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఈ దాడులు ఏకకాలంలో జరగడం సంచలనం కలిగించింది. అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఆయా కార్యాలయాల్లోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా భూ రిజిస్ట్రేషన్లు, ఆస్తుల క్రయవిక్రయాలకు సంబంధించిన లావాదేవీలలో అక్రమాలు, అవినీతి జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు జరిగినట్టు తెలుస్తోంది. ఈ ఏకకాల దాడులలో చిలకలూరిపేట రిజిస్ట్రార్ కార్యాలయం పరిస్థితి చర్చనీయాంశంగా మారింది. అధికారులు తనిఖీకి వచ్చే సమయానికి అక్కడి ఆఫీసులో ఎవరూ లేకపోవడం గమనార్హం. కీలక అధికారి సెలవు పెట్టి కార్యాలయంలో లేకుండా పోవడం వెనుక, సీబీఐ దాడుల గురించి ముందే సమాచారం తెలిసి, తప్పించుకోవడానికి సెలవు పెట్టారన్న అనుమానాలు లేకపోలేదు.ఈ దాడులలో పలు చోట్ల కీలక పత్రాలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అవినీతికి పాల్పడిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశం ఉంది.

## బాలికలు మరియు మహిళలపై జరిగే నేరాలను ధైర్యంగా ఎదుర్కోవాలి

డి.ఎస్పీ దేగల ప్రభాకర్



**పలమనేరు,పెన్ పవర్, నవంబరు 05**
బాలికలతో బాటు మహిళలపై జరిగే నేరాలను ధైర్యంగా ఎదుర్కోవాలని డీఎస్పీ దేగల ప్రభాకర్ సూచించారు.బుధవారంప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలు,ఎన్.డి.పి.ఎస్ చట్టం,రోడ్డు భద్రత,ఈవ్ టీజింగ్ మరియు మహిళలపై నేరాలు వంటి అంశాలపై విద్యార్థులు అవగాహన కల్పించు కోవాలనన్నారు.అలాగే సమాజంలో జరిగే నేరాలను ధైర్యంగా పోలీసులకు సమాచారం అందించాలని అప్పుడే వాటిని కట్టడి చేసి,శాంతిభద్రతల ను నెలకొల్పేందుకు అవకాశం కల్పించడాని కి వీలవుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సిఐ. మురళీ మోహన్, ఎస్.ఐ లు లోకేష్ రెడ్డి,స్వర్ణతేజ,అలాగే సుమారు 200మంది విద్యార్థులు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ప్రభుత్వ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం

చిత్తూరుజిల్లా ప్రధాన కార్యదర్శిగా పి.బి.బాలసుబ్రమణ్యం ఎన్నిక



**పలమనేరు,పెన్ పవర్, నవంబరు 05**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ప్రభుత్వ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం చిత్తూరుజిల్లా కమిటీ ఎన్నికలను చిత్తూరు లొని సూపర్డెంట్ ఆఫ్ ఇంజనీర్ కార్యాలయ ఆవరణంలో నిర్వహించారు.ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.పీ.మహేష్ కుమార్ వ్యవహరించారు. కాగా కమిటీలోని పదవులన్నిటికీ నామినేషన్ స్వీకరించడం జరిగింది. అన్ని పదవులకు ఒక్కొక్కరు మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు.ఈ ఎన్నికలలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా పలమనేరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో పనిచేస్తున్న పి.బీ.బాల సుబ్రమణ్యం ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులుఎల్. నవోదయ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నబాబు, రాష్ట్రకోశాధికారి ఎస్కే.నూర్ భాషా, అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాసరావు,వర్కింగ్ ప్రెసిడెంట్ నబిఅహ్మద్, చిత్తూరు జిల్లాకు నూతన అధ్యక్షురాలుగా ఎన్నికైన భవ్యశ్రీ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగ సంఘ నాయకులు నాగరాజు, కిరణ్,మురళి భార్గవ్,రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు తహసీల్దార్ ఇన్బనాథన్



**పలమనేరు,పెన్ పవర్,నవంబరు 05**
ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఎస్టీలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నట్లు తహశీల్దారు ఇన్బనాధన్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధార్ కార్డు,రేషన్ కార్డు కలిగి ఉండి,ఇంతవరకూ వారి పేరు మీద గ్యాస్ కనెక్షన్ లేకపోతే దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని అర్హత కలిగిన షెడ్యూల్డ్ తెగలు వినియోగించుకోవాలని సూచించారు.అర్హత ఉన్న వారు దగ్గరలోని సచివాలయం,గ్యాస్ ఏజెన్సీలు,తహశీల్దారు కార్యాలయాల్లో వివరాలు నమోదు చేసుకోవచ్చని తహసీల్దార్ తెలిపారు.

## శ్రీకాళహస్తిలో 9 మంది స్మగ్లర్లు అరెస్ట్

**శ్రీ కాళహస్తి , పెన్ పవర్ , నవంబర్ 5**
శ్రీకాళహస్తి అటవీ పరిధిలో బుధవారం ఉదయం టాస్క్ ఫోర్స్ పోలీసులు కూబింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా 20 ఎర్రచందనం దుంగలు, 9 మంది స్మగర్లను అరెస్టు చేసినట్లు ఏఆర్ఎస్ఐ ఈశ్వర్ రెడ్డి తెలిపారు. అరెస్టైన వారిలో తిరుపతి జిల్లాకు చెందిన వారు ఇద్దరు ఉన్నట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు వారిని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్కు తరలించారు.



# ప్రజల ఆరోగ్యం మా ఆస్తి అమ్మకానికి కాదు

## అయిన ముక్కుల గ్రామంలో కోటి సంతకాల సేకరణ





**పెద్ద దోర్నాల పెన్ పవర్ నవంబర్ 3**

ప్రజల ఆరోగ్యం మా ఆస్తి అమ్మకానికి కాదు వైద్య విద్య పేద విద్యార్థుల హక్కు దానిని కాపాడటమే వైయస్సార్ సిపి లక్ష్యమని వైసీపీ మండల కన్వీనర్ గంటా వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అయిన ముక్కుల గ్రామాల్లో మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కోడి సంతకాల సేకరణ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి యర్రగొండపాలెం శాసనసభ్యులు పి.చంద్రశేఖర్ ఆదేశాల మేరకు నిర్వహించారు ఈ సందర్భంగా వైసీపీ మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ. వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చిన వైద్య విప్లవం దేశానికే ఆదర్శమని అన్నారు. పేద విద్యార్థులు కూడా వైద్యుడు కావచ్చని నిరూపించిన నాయకత్వాన్ని కాపాడుతారు వైద్య విద్య ధనికుల పాదానికి చేయాలని కుట్రలను ప్రజలే తిప్పి కొడతారని అన్నారు.ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రవేటీకరణకు వ్యతిరేకంగా వైస్సార్సీపీ ప్రజా ఉద్యమములో భాగంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవోలకు నిరసనగా ఉత్తర్వులను వెంటనే రద్దు చేసి ప్రభుత్వమే మెడికల్ కాలేజీల నిర్మాణం, నిర్వహణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా గడప గడప కి వెళ్లి సంతకాలు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చిట్యాల యోగిరెడ్డి,యక్కంటి మల్లారెడ్డి,వెన్నా కాశిరెడ్డి,యక్కంటి లింగారెడ్డి,చిట్యాల శ్రీనివాసరెడ్డి, చిట్యాల రామకృష్ణారెడ్డి, సానికొమ్మురామకొండారెడ్డి, కం1బాలపల్లియల్లా రెడ్డి, ఆతకూరిరామిరెడ్డి, గోలమారు రాజశేఖర్ రెడ్డి, బండి గురువారెడ్డి, ముల్లంగి శంకర్ రెడ్డి, సాదం పిచ్చయ్య,చిట్యాల చలామారెడ్డి, తిరుమలరెడ్డి జగదీశ్వర్ రెడ్డి,గంట కోటిరెడ్డి వడ్లమూడి వెంకటేశ్వర్లు, కోడి వెంకటయ్య,దర్శనం వెంకటయ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

### జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు





**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ నవంబర్ 5**

జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు రెండవ రోజు బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో స్కూల్ బస్సులు, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, లారీలు, వ్యాన్లు మరియు ఇతర వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరిగింది. ఉదయం నుండి 39 టీంలతో పోలీసులు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి పత్రాలను పరిశీలించారు. మోటార్ వాహన చట్టం ప్రకారం, ప్రతి వాహనంలో ప్రమాదం సంభవించిన సందర్భంలో అవసరమైన అత్యవసర పరికరాలు ఉన్నాయా లేదా అన్న విషయాన్ని పోలీసులు పూర్తిగా పరిశీలిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

# బ్యూటీ పార్లర్ కోర్సు నందు ఉచిత శిక్షణ




**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ నవంబర్ 05**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళలకు బ్యూటీ పార్లర్ కోర్సు నందు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లుగా రూడ్ సెట్ సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 25వ తేదీ నుండి డిసెంబర్ 29వ తేదీ వరకు 35 రోజులు ఒంగోలులో శిక్షణ ఇస్తామన్నారు. 19 ఏళ్ల నుండి 50 ఏళ్ల లోపు మహిళలు తమ వివరాలతో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి, సదుపాయాలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గలవారు ఫోన్ నెంబర్ 9573363141 ను సంప్రదించాలని కోరారు.

# రోడ్డు నియమ నిబంధనలను పాటించకపోతే కఠిన చర్యలు తప్పవు

### పొదిలి ఎస్ ఐ వేమన



**పొదిలి, పెన్ పవర్, నవంబర్ 5**

వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలను పాటించకపోతే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పొదిలి మండల పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ వి. వేమన హెచ్చరించారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు బుధవారం నాడు ఆయన పట్టణ శివారులోని మార్కాపురం అడ్డరోడ్డు ప్రాంతంలో వాహనాలను తనిఖీ జరిపారు. ఈ సందర్భంగా ఎస్ ఐ వేమన లారీలు, ప్రైవేటు ట్రావెల్ బస్సులు, ట్రాక్టర్లు తదితర భారీ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ జరిపారు. అలాగే వాహనాలకు సంబంధించిన పత్రాలు లేకుండా తిరుగుతున్న పలు వాహనాల కు జరిమానా విధించడంతోపాటు హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ వేమనతోపాటు సిబ్బంది కూడా పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలి -జిల్లా కలెక్టర్ రాజాబాబు



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ నవంబర్ 05**

విద్యతోపాటు క్రీడారంగంలో కూడా ప్రావీణ్యం సంపాదించాలని అప్పుడే విద్యార్థుల ఎదుగుదలకు ద్రోహదపడుతుందని, దీంతోపాటు క్రీడారంగంలో ఉన్నత స్థానాలు అధిరోహించి దేశ ప్రతిష్టను చాటడానికి అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ రాజాబాబు అన్నారు. బుధవారం అంతర్జాతీయ తైక్వాండో సమైక్య వారి ఆధ్వర్యంలో గ్రాండ్ మాస్టర్ బి.వి. రమణయ్య నిర్వహించిన బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ ఎగ్జామినేషన్ లో ఒంగోలు విద్యార్థిని విద్యార్థులు ఎంతో ప్రతిభ కనబరిచి బ్లాక్ బెల్స్ తో పాటు మాస్టర్ డిగ్రీ సర్టిఫికెట్స్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు చేతులు మీదుగా పిల్లలకి సర్టిఫికెట్స్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడారంగంలో ఆసక్తి కనపరచాలని తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ సర్టిఫికెట్స్ బహుకరణ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి కుంటి రాజేశ్వరి, ఆల్ ఇండియా పోర్ట్ ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఏపీ చైర్మన్ షేక్ ఖలీఫాతుల్లా బాషా, ఇంటర్నేషనల్ థైకాండో కోచ్ ఫిఫ్త్ డాన్ ఛాంపియన్ షేక్ కరీముల్లా , బి జే ఎం సి ప్రకాశం జిల్లా అధ్యక్షులు పఠాన్ సాజిద్ ఖాన్, ఆదిల్ గ్రూప్ ఆఫ్ బిజినెస్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ ఆదిల్, తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆధునిక సస్యరక్షణ పద్ధతులను పాటించాలి

## మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులు రెడ్డి

**పొదిలి, పెన్ పవర్, నవంబర్ 5**

రైతులు ఆధునిక సస్యరక్షణ పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయాధికారి దేవి రెడ్డి శ్రీనివాసులు రెడ్డి కోరారు. బుధవారం నాడు మండలంలోని మాదాల వారి పాలెం, ఓబులక్కపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని రైతులతో వ్యవసాయాధికారి శ్రీనివాసులు రెడ్డి సమావేశపరి చి , ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న పంటల ను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను వారికి అర్థమయ్యే రీతిలో వివరించారు. అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలను కూడా ఆయన వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని పొలాల్లోకి వెళ్లి, రైతులు సాగుచేసిన వివిధ పంటలను పరిశీలించడంతోపాటు వాటిని సంరక్షించుకునేందుకు తీసుకోవాల్సిన




జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రమణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నప్రసాద వితరణలో పాల్గొన్న ముత్తుముల క్రిష్ణ కిశోర్







**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 5**

గిద్దలూరు పట్టణంలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి , అయ్యప్ప స్వామి దేవస్థానం లో అన్నప్రసాద వితరణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం నాయకులు ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి పాల్గొన్నారు. దేవస్థాన కమిటీ కృష్ణ కు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. కృష్ణ కిషోర్ రెడ్డి ఆలయంలో శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు .అనంతరం అయ్యప్ప మాల స్వాములకు స్వయంగా బోజనాలను వడ్డించారు. ఈసందర్బంగా ఆలయ కమిటీ క్రిష్ణ కిశోర్ రెడ్డిని శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల , పట్టణ నాయకులు దేవాలయకమిటీ సభ్యులు ,భక్తులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి నిర్మాణ పనులను పరిశీలన

### కె బి ఆర్ వ్యవసాయ కళాశాల చైర్మన్ కె వి ప్రకాష్ రావు, సెక్రెటరీ -కరెస్పాండెంట్ కదిరి పార్థసారథి



**సి ఎస్ పురం, పెన్ పవర్ నవంబర్ 5**

మండలంలోని శీలంవారిపల్లె, కోవిలంపాడు,సి ఎస్ పురం కూడలిలో కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో కనిగిరి మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు నిర్మిస్తున్న శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం పనులను కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల చైర్మెన్ కె వి ప్రకాశ్ రావు, సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి పరిశీలించారు.ఈ సందర్భంగా కదిరి బ్రదర్స్ మాట్లాడుతూ దేవస్థానం పనులు వేగవంతం చేసి త్వరలో ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. పరిశీలించిన వారిలో మాజీ ఎంపిటిసి లు మునగల వెంకట నారాయణ రెడ్డి,మూరం కాశిరెడ్డి, నారాయణ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి,కొట్టే శ్రీను, తీకెనం బాబురావు, పట్నం తిరుపతయ్య, కళాశాల ఇంజనీర్ నిమ్మల శ్రీనివాసులు, అన్నంగి కన్నయ్య, తదితరులు ఉన్నారు.

# పొదిలి సి ఐ ను కలసిన కరిముల్లా బేగ్

**పొదిలి, పెన్ పవర్, నవంబర్ 5**

పొదిలి పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజేష్ కుమార్ ను హబీబుల్లా ఫౌండేషన్ చైర్మన్ కరిముల్లా బేగ్ కలిశారు. పొదిలి సీఐ రాజేష్ కుమార్ ఇటీవలనే బదిలీపై పొదిలి సర్కిల్ ఇన్స్పెక్టర్ గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం నాడు కరీముల్లా బేగ్ స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ రాజేష్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ముందుగా కరీముల్లా బేగ్ సి ఐ రాజేష్ కుమార్ ను శాలువా, పూలదండతో సత్కరించి, సర్కిల్ కార్యాలయానికి రెండు గోడ గడియారాలను బహుకరించారు. చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద వర్గాలకు, సమాజాభివృద్ధి కోసం కరీముల్లా బేగ్ చేస్తున్న సేవలను తెలుసుకున్న సి ఐ రాజేష్ కుమార్ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది షేక్ షబ్బీర్, మౌలానా రబ్బాని, మదరస ప్రిన్సిపాల్ తో పాటు ఎస్ ఖాదర్ భాష తదితరులు పాల్గొన్నారు.



## 7 కోట్లు.. 55 మీటర్లు..
## 100మందిని ఒకేసారి ఆపగలిగే దృఢత్వం

**విశాఖపట్టణం, నవంబర్ 5, పెన్ పవర్:** భవిష్యత్తులో ఏ ఇజమూ ఉండదు.. కేవలం టూరిజం మాత్రమే ఉంటుంది “ అని ఏపీ సీయం చంద్రబాబు పదే పదే చెబుతుంటారు. దాని తగ్గట్టే ఆంధ్రప్రదేశ్లో టూరిజం ప్రాజెక్టులు చాలానే పట్టాలు ఎక్కాయి. కొన్ని ప్రభుత్వమే చేపడుతుంటే మరికొన్ని పీపీపీ మోడల్ లో తయారవుతున్నాయి. అయితే మాటల్లో చెప్పినంత వేగంగా ఇవి రియాల్టీ లోకి రావడం లేదు. చాలా విషయాల్లో కమ్యూనికేషన్ గ్యాప్ బలంగానే ఉంది. అలాంటి వాటికి ఉదాహరణ వైజాగ్ లోని కైలాసగిరి గ్లాస్ బ్రిడ్జ్ ఓపెనింగ్. నెలల క్రితమే తయారైన ఈ బ్రిడ్జ్ ఇప్పటికీ ఓపెన్ కాకపోవడం వైజాగ్ వాసుల్లో అసహనాన్ని రేకెత్తిస్తోందిభారతదేశంలోనే ఇంకెక్కడా లేని అతి పెద్ద కేంటి లివర్ గ్లాస్ బ్రిడ్జ్ విశాఖలో రెడీ అయిందనే వార్త ఒక్క వైజాగ్ వాసులకే కాక రెండు తెలుగు రాష్ట్రాల్లోని టూరిస్టులకు చాలా ఉత్సాహాన్ని ఇచ్చింది. కైలాసగిరి కొండ అంచు పై నుండి గ్లాస్ బ్రిడ్జిపై నడుస్తూ పర్వతం,లోయ, అడవి,సముద్రం ఇలా విభిన్నమైన ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించే అవకాశం ఈ గ్లాస్ బ్రిడ్జ్ ఇస్తుందని అందరూ ఉప్పొంగి పోయారు. మొదట్లో ఆగస్టు 15 టైమ్ కి రెడీ అవుతుందని భావించినా పనులు ఆలస్యం వల్ల సెప్టెంబర్ లో ప్రారంభిస్తామన్నారు.వైజాగ్ గ్లాస్ బ్రిడ్జ్ ఓపెనింగ్ ఇంకెప్పుడు ? నిర్మాణం పూర్తయినా ఎదురుచూపులు ఎందుకు? సెప్టెంబర్ 25 కి బ్రిడ్జి ఓపెన్ అవుతుందని వార్తలు కూడా వచ్చాయి. తర్వాత అక్టోబర్ వచ్చింది, దసరా, దీపావళి కూడా వెళ్లిపోయాయి. నవంబర్ నెల కూడా వచ్చేసింది. అయినప్పటికీ ఈ స్కైవాక్ గ్లాస్ బ్రిడ్జ్ ఓపెనింగ్ ఎప్పుడు అనేది తెలియక వైజాగ్ వాసులు అయోమయంలో పడ్డారు. టూరిజం పరంగా ఎంతో పొటెన్షియల్ ఉన్న వైజాగ్ లో ఈ గ్లాస్ బ్రిడ్జ్ పెద్ద అట్రాక్షన్ అవుతుందని అందరూ భావిస్తున్నారు. ఏడు కోట్లు ఖర్చుపెట్టి 55 మీటర్ల పొడవున ఈ గ్లాస్ బ్రిడ్జ్ ని నిర్మించారు. కేరళ లో ఇలాంటి బ్రిడ్జ్ ఇంకొకటి ఉంది కానీ దాని పొడవు 38 మీటర్లే. ఇదే ఏడాది మిజోరామ్ లో కూడా ఐజ్వాల్ స్కై వాక్ పేరుతో ఒక గ్లాస్ బ్రిడ్జ్ ఓపెన్ చేశారు కానీ దాని పొడవు 10 మీటర్లే. ఎలా చూసినా విశాఖపట్నం లోని స్కై వాక్ బ్రిడ్జ్ దేశం లోనే చాలా పెద్దది. 250%ఎం% వేగం తో వీచే గాలులను సైతం తట్టుకునేలా దీన్ని నిర్మించినట్టు చెబుతున్నారు. %ఎవీ=ణూ% ఈ నిర్మాణన్ని సూపర్ వైజ్ చేస్తుండగా కేరళకు చెందిన %=జీ% అడ్వెంచర్స్ సంస్థ నిర్మాణం చేసింది. ఇది ఒకేసారి 100 మంది బరువును తట్టుకుంటుంది అని నిర్వాహకులు చెబుతున్నారు.%ఎవీ=ణూ% చైర్మన్ ప్రణవ్ గోపాల్ ఈ స్కై వాక్ బ్రిడ్జ్ పై ప్రత్యేక దృష్టి పెట్టారు.. చాలాసార్లు వెళ్లి నిర్మాణాన్ని పర్యవేక్షించి వచ్చారు. ఆయన ఈ స్కైవాక్ బ్రిడ్జిని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఓపెన్ చేయించాలని ప్రయత్నిస్తున్నారని సమాచారం. బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన తర్వాత లోకేష్ రెండుసార్లు వైజాగ్ వెళ్లి వచ్చారు. అయినప్పటికీ స్కై వాక్ బ్రిడ్జ్ ఓపెన్ కాలేదు. లోకేష్ టైం దొరక్కే గ్లాస్ బ్రిడ్జ్ ఓపెనింగ్ లేట్ అవుతుందని వీఎంఆర్డిఏ వర్గాలు చెబుతున్నాయి వైజాగ్ గ్లాస్ బ్రిడ్జ్ ఓపెనింగ్ ఇంకెప్పుడు ? నిర్మాణం పూర్తయినా ఎదురుచూపులు ఎందుకు? ఈ నెలలో ( నవంబర్ 14-15 తేదీల్లో ) వైజాగ్ లో రెండు రోజులపాటు అంతర్జాతీయ సదస్సు జరగబోతుంది. పెట్టుబడులను ఆకర్షించడం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకంగా దీన్ని నిర్వహిస్తోంది. దేశ విదేశాల్లోని పారిశ్రామిక వ్యాపార అతిథులను ఆహ్వానించడం కోసం సీఎం చంద్రబాబు లోకేష్ విదేశీ పర్యటనలు సైతం చేసి వచ్చారు. వైజాగ్ లోని టూరిజం అట్రాక్షన్లు అన్నింటికీ క్రొత్త అందాలు దిద్దుతున్నారు. మరి ఆ సందర్భంగానన్నా వైజాగ్ స్కై వాక్ బ్రిడ్జ్ ని అందుబాటులోకి తీసుకొస్తారో లేదో చూడాలని సగటు విశాఖ వాసి కోరుతున్నాడు.

## జూన్ నాటికి భోగాపురం ఎయిర్ పోర్టు రెడీ

**విజయనగరం, నవంబర్ 5, పెన్ పవర్:**ఆంధ్రప్రదేశ్లో కొత్త విమానాశ్రయాల దిశగా అడుగులు పడుతున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు వేగవంతం అయ్యాయి. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు భోగాపురం ఎయిర్‌పోర్ట్ పనులను పరిశీలించి, ఉత్తరాంధ్రకు ఇది కీలక కేంద్రంగా మారుతుందని తెలిపారు. 2026 జూన్ నాటికి విమానాశ్రయాన్ని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టుతో ఈ ప్రాంత అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు.ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ఎయిర్‌పోర్టుల దిశగా అడుగులుపడుతున్నాయి.. అలాగే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు వేగవంతం చేశారు. ఈ మేరకు ఎయిర్‌పోర్ట్ పనుల్ని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పరిశీలించారు, పనుల పురోగతిపై ఆరా తీశారు. భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు ఒక ముఖ్యమైన కేంద్రంగా మారుతుందన్నారు రామ్మోహన్ నాయుడు. ఈ విమానాశ్రయం పూర్తయితే, ఈ ప్రాంతంలో జరిగే ఏ అభివృద్ధి కార్యక్రమానికైనా ఇది ఒక ప్రధాన కేంద్రంగా ఉంటుందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విమానాశ్రయ నిర్మాణాన్ని ఒక పెద్ద సవాలుగా స్వీకరించారన్నారు. ఎన్ని సమస్యలు ఎదురైనా, అనుకున్న సమయానికి విమానాశ్రయాన్ని పూర్తి చేయడానికి అధికారులు నిబద్ధతతో పనిచేస్తున్నారన్నారు. 2026 జూన్ నెలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచిస్తున్నారన్నారు.ఈ ఏడాది డిసెంబరు చివరి వారంలో లేదా వచ్చే ఏడాది జనవరి మొదటి వారంలో విమానాశ్రయంలో విమానం ట్రయల్ రన్ నిర్వహించే అవకాశం ఉందన్నారు రామ్మోహన్‌నాయుడు. విమానాశ్రయం చుట్టూ ఐదు స్టార్ హోటళ్లు కూడా వస్తున్నాయని, దీనివల్ల స్థానికులకు వారి ప్రతిభకు తగిన ఉద్యోగాలు లభిస్తాయన్నారు. తద్వారా, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే వారి సంఖ్య తగ్గుతుందన్నారు. భోగాపురం విమానాశ్రయం పనులు నాణ్యతతో జరుగుతున్నాయని, విశాఖపట్నం కంటే ఇక్కడ ఎక్కువ విమానాలు నడిచేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే కొన్ని ఎయిర్‌లైన్స్‌తో మాట్లాడామన్నారు. నావిగేషన్, ట్రాఫిక్ కంట్రోల్ సదుపాయాలు కల్పిస్తామని, గ్లోబల్ స్టాండర్డ్స్‌తో విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నామన్నారు. భోగాపురం విమానాశ్రయంలో టాక్సీవే, రన్‌వేల నిర్మాణం వేగంగా జరుగుతుందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం 91.7 శాతం పూర్తి అయిందన్నారు. భోగాపురంలో ఏవియేషన్ యూనివర్సిటీ నిర్మాణానికి కసరత్తు జరుగుతోంది అన్నారు.భోగాపురం విమానాశ్రయాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మిస్తున్నామని, ఈ నెలలో విశాఖలో నిర్వహించబోయే పారిశ్రామిక సదస్సులో ఏవియేషన్ రంగానికి సంబంధించిన పరిశ్రమలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. గతంలో కేంద్రమంత్రి అశోక్‌గజపతిరాజు పునాది వేసిన ఈ విమానాశ్రయం చివరి దశకు రావడం చాలా సంతోషంగా ఉందని.. భోగాపురం విమానాశ్రయం ఈ ప్రాంత రూపురేఖలను మార్చివేసి, అభివృద్ధిని వేగవంతం చేస్తుందని అన్నారు. ఆ తర్వాత, విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించిన జీఎంఆర్, ఎల్అండ్‌టీ అధికారులతో ఒక సమీక్ష సమావేశం జరిగింది. విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి విమానాశ్రయానికి త్వరగా చేరుకోవడానికి అవసరమైన కొత్త రోడ్ల నిర్మాణం, ట్రంపెట్ బ్రిడ్జి వంటి వాటిపై అధికారులతో చర్చించారు. ఈ కొత్త రోడ్లు, బ్రిడ్జిలు ప్రయాణ సమయాన్ని తగ్గించి, ప్రజలకు సౌకర్యంగా ఉంటాయని భావిస్తున్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించాను. ప్రధాన టెర్మినల్ భవనం, అరైవల్-డిపార్చర్ జోన్లు, బ్యాగేజ్ హ్యాండ్లింగ్ సిస్టమ్ తదితర కీలక సౌకర్యాలను పరిశీలించి, ఉత్తరాంధ్ర ప్రాంత సాంస్కృతిక ప్రత్యేకతను ప్రతిబింబించేలా డిజైన్‌లో మార్పులపై సూచనలు ఇచ్చాను. GMR మరియు L&T సంస్థలతో సమీక్షా సమావేశం నిర్వహించి, మిగిలిన పనులను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని, ప్రతి అంశంలోనూ ప్రపంచ స్థాయి ప్రమాణాలు పాటించాలని ఆదేశించాను.ప్రాజెక్టు ఇప్పటివరకు 91.7% పూర్తయినందుకు సంతోషంగా ఉంది. పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర ప్రాంత ఆర్థికాభివృద్ధికి, వాణిజ్యానికి, పర్యాటకానికి ప్రధాన కేంద్రంగా మారనుంది. గౌరవనీయులైన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి దూరదృష్టి నాయకత్వంలో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును 2026 జూన్ నాటికి పూర్తి చేసి దేశానికి అంకితం చేయడానికి కట్టుబడి ఉన్నాము' అంటూ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ట్వీట్ చేశారు.

## స్టూడెంట్స్ తో కాళ్లు నొక్కించుకున్న టీచర్ సస్పెండ్.

**శ్రీకాకుళం:పెన్ పవర్:** పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయురాలు వారితో కాళ్లు పట్టించుకున్న ఘటన శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం బందపల్లి బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో వెలుగు చూసిన విషయంవిదితమే. ఉపాధ్యాయురాలు సుజాత సెల్ ఫోన్ లో మాట్లాడుతూ.. ఇద్దరు విద్యార్థినులతో కాళ్లు నొక్కించుకుంటున్న వీడియో ఆలస్యంగా బయటకు వచ్చింది. విచారణ అనంతరం ఉపాధ్యాయురాలు సుజాతనుసస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## పదేళ్ల బాలిక ఆత్మహత్య

**రామచంద్రపురంపెన్ పవర్:**రామచంద్రపురం పట్టణంలో భాష్యం స్కూల్లో 5వ తరగతి చదువుతున్న చిర్ర హాని రంజిత బాలిక (10) ఉరివేసుకొని చనిపోయిందని సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. సిర్ర రంజిత ,ఇంటిలోనే చున్నీతో హ్యాంగింగ్ చేసుకుంది. మృతురాలు ఓ ప్రైవేట్ స్కూల్లో ఐదవ తరగతి స్ చదువుతుంది. తల్లి సునీత రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో నర్స్ గా పని చేస్తుంది. బాలిక మృతిపై కేసును అన్నికోణాల్లో విచారణ చేస్తున్నామని రామచంద్రపురం పోలీసులు వెల్లడించారు.

# ఫోటో షూట్లు చేయడానికే జగన్ పర్యటన

**విజయవాడ పెన్ పవర్:**రైతు పరామర్శ పేరుతో జగన్ రెడ్డి డీజేలు పెట్టి పార్టీ జెండాలతో ఊరేగటానికే వచ్చాడు. రైతు కష్టంలో ఉన్నప్పుడు నేషనల్ హైవేపై టెంట్లు వేసుకుని రెడ్ కార్పెట్ మీద ఫోటోషూట్లు చేశాడని టీడీపీ నేత దేవినేని ఉమా విమర్శించారు. మొంథా తుఫాను సమయంలో రైతుల కష్టసమయంలో చంద్రబాబు గారు, పవన్ కళ్యాణ్ గారు కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. జగన్ మాత్రం ప్యాలెస్లో పడుకున్నాడు. పంటల భీమా కూడాఇవ్వలేదని జగన్ నిర్వాకాన్ని కేంద్ర మంత్రి పార్లమెంట్లో ఎండగట్టారు. జగన్ హయాంలో 60 లక్షల ఎకరాల్లో వేల కోట్ల పంట నష్టం, కానీ పరిహారం లేదు ၊ అబద్ధాలే ఎక్కుని అన్నారు.ప్రతిపక్షంలో చంద్రబాబు గారు నేలపై కూర్చుని నీ మెడలు వంచి రైతుల కోసం 590 కోట్ల

బీమా ప్రీమియం చెల్లించేలా చేశారు. కేంద్రం ఇచ్చిన ?3,600 కోట్లు కూడా రైతుల ఖాతాల్లో జమ చేయలేని నిర్వాహకంజగన్ది. 2024%-%25లో కూటమి ప్రభుత్వం 7.65 లక్షల మంది రైతుల వద్ద నుంచి ?12,857 కోట్లకు దాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లో ఖాతాల్లో జమ చేసింది. 'అన్నదాత సుఖీభవ' కింద ?3,174కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. త్వరలో రెండో విడత నిధులు రానున్నాయి. ఉల్లి, పొగాకు, కోకో, మామిడి, టమాట రైతులను కష్టకాలంలో ఆదుకున్న ఘనత చంద్రబాబుది. జగన్ పాలనలో పోర్టల్లో కూడాతప్పుడు కోతలు, తప్పుడు డేటా. నేడు వచ్చి రైతు పరామర్శ పేరుతో కబుర్లు చెబుతున్నాడు. ఐదేళ్ల వైసీపీ హయాంలో 9 విపత్తులు,

?20 వేల కోట్ల నష్టం. కానీ రైతుల వద్దకు వెళ్లలేదు, అబద్ధాలతో కాలంగడిపాడు. జగన్ రైతులకు బకాయిగా పెట్టిన ?1,700 కోట్ల ధాన్యం డబ్బు కూటమి ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. ధాన్యం డబ్బుల్లో కక్కుర్తి పడి గడ్డం గ్యాంగ్తో ప్యాలెస్కు జగన్ తరలించాడు . అధికారంలోకివచ్చిన నెల రోజుల్లోనే కూటమి ప్రభుత్వం ?6,000 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసిందని అన్నారు.

# నారా లోకేష్ లో ఎంత మార్పు

**విజయవాడ, నవంబర్ 5, పెన్ పవర్:**
రాజకీయాల్లో ప్రతి అనుభవం అక్కరకు వస్తుంది. రాజకీయ పరిస్థితులు కూడా నేతలలో ఒక రకమైన మార్పునకు కారణం అవుతాయి. ఈ విషయంలో ఏపీ మంత్రి నారా లోకేష్ గురించి మనం ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాలి. ఎలాంటి లోకేష్.. ఎలా మారారు అన్నది ప్రత్యర్థులకు తెలుసు. సొంత పార్టీ వారికి తెలుసు. ఏపీ ప్రజలకు తెలుసు. లోకేష్ ప్రతి మార్పును గమనిస్తున్నారు ఈ రాష్ట్ర ప్రజలు. వ్యతిరేకించిన వారే గౌరవిస్తున్నారు. వ్యతిరేకంగా ప్రచారం చేసిన వారి ఫిదా అవుతున్నారు. ఒక నాయకుడికి ఇంతకంటే ఏం కావాలి. గోల్డెన్ స్పూన్ తో పుట్టే నాయకుడి కంటే.. గ్రౌండ్ లెవెల్ నుంచి కష్టాలు ఎదురొడ్డి నిలిచేవాడే నిజమైన నాయకుడిగా అవతరిస్తాడు. అటువంటి ఛాన్స్ వచ్చింది నారా లోకేష్ కు. తాత ఎన్టీఆర్ మాజీ ముఖ్యమంత్రి. తండ్రి చంద్రబాబు సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పదవి అలంకరించిన వారు. మామ బాలకృష్ణ తెలుగు సినిమా ఇండస్ట్రీలో టాప్ మోస్ట్ యాక్టర్. అటువంటి నారా లోకేష్ ఎంట్రీ ఎలా ఉండాలి. తండ్రి చంద్రబాబు గ్రాండ్ ఎంట్రీ ఇవ్వగలిగారు. కానీ అంతే మించి రాజకీయ ప్రత్యర్థులను ఇచ్చారు. కానీ వాటన్నింటినీ దాటుకొని తనను తాను ప్రూవ్ చేసుకున్నారు నారా లోకేష్.2024 ఎన్నికల వరకు లోకేష్ పై ఎవరికీ నమ్మకం లేదు. చివరకు సొంత పార్టీ శ్రేణులకు సైతం ఏదో ఒక మూల అపనమ్మకం. రాష్ట్రంలో సుదీర్ఘకాలం పాదయాత్ర చేసి ప్రజలతో మమేకమై వచ్చారు. సొంత పార్టీతో పాటు ప్రజలలో చిన్నపాటి ముద్రతో బయలుదేరారు లోకేష్. కానీ కేంద్ర పెద్దలతో మమేకం అయిన తీరు, తన తండ్రి అక్రమ అరెస్టు సమయంలో తపన పడిన తీరు, కూటమి కట్టడంలో వ్యవహరించిన తీరు, అధికారంలోకి వచ్చిన తరువాత పాలనతో పాటు పార్టీ పై ముద్ర చాటిన తీరు%ొ% ఇలా ప్రతి అంశంలోనూ పై చేయి సాధిస్తూ వచ్చారు. ఇప్పుడు నారా లోకేష్ అంటే ఒక శక్తి, ఒక వ్యవస్థ అన్నట్టు మార్చుకున్నారు.లోకేష్ తీసుకున్న నిర్ణయం అద్భుతంగా ఉంటుంది. తనను తాను భావి నాయకుడిగా ఆవిష్కరించుకునే తీరు కూడా ఆకట్టుకుంటుంది. నిర్ణయాల్లో తప్పుడు



వ్యవహారాలు ఉండవు. ఒకరి ప్రభావం కూడా ఉండదు. ఇటీవల జరిగిన రెండు ఘటనలే దానికి ఉదాహరణ. కాశీబుగ్గ లో ఓ ఆలయంలో తొక్కిసలాట జరిగింది. పదిమంది చనిపోయారు. అక్కడ గుడి కట్టింది ఓ సామాన్య భక్తుడు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా ప్రతి ఒక్కరికి తిరుమల మాదిరిగా దర్శనం కల్పించాలన్న లక్ష్యంతో నిర్మించారు. కానీ ఈ ఘటన జరిగిన తర్వాత సదరు ఆలయ వ్యవస్థాపకుడు పై కేసు పెట్టాలని ఒత్తిడి పెరిగింది. అరెస్టు చేయాలన్న డిమాండ్ వచ్చింది. కానీ అందుకు అంగీకరించలేదు లోకేష్. అది సహేతుకం కాదని తేల్చేశారు. ఇటువంటి ప్రైవేటు దేవాలయాల విషయంలో ఒక వ్యవస్థను తేవాలని మాత్రమే చూశారు. సొంత పార్టీతోపాటు ప్రత్యర్థి పార్టీల ఒత్తిడికి ఎంత మాత్రం తలవంచలేదు లోకేష్.ఏపీకి చెందిన భక్తులు తమిళనాడులోని ఆలయాల సందర్శనకు వెళ్లారు. ప్రత్యేక బస్సులు వెళ్లారు. అక్కడి అల్లరి మూకాలతో పాటు ఆటో డ్రైవర్లు అడ్డగించారు. అల్లరి చేసే ప్రయత్నం చేశారు. ఆ సమస్య మంత్రి నారా లోకేష్ దృష్టికి వచ్చింది. ఇదో ప్రాంతీయ సమస్యగా మారుతుందని భావించారు లోకేష్. నేరుగా తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ తో సంప్రదించారు. జరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ రాష్ట్రాల మధ్య సమస్యగా మార్చవద్దని విజ్ఞప్తి చేశారు. ఉదయనిది స్టాలిన్ దీనికి సానుకూలంగా స్పందించారు. బస్సులో వెళ్ళిన ఏపీ భక్తులతో పాటు పర్యాటకులకు భద్రత కల్పించారు. ఈ రెండు ఘటనలు లోకేష్ భావి నాయకుడిగా ఊహించడానికి ఎంత మాత్రం తక్కువ కాదు అని తేలిపోయింది. ప్రజలకు పాలన అందించడం అంటే కేవలం హోదా అనుభవించడం కాదు. వారి కష్టసుఖాల్లో.. సుఖ దుఃఖాల్లో ఉండడం అని నిరూపించారు నారా లోకేష్. నిజంగా ఇది అభినందనీయమే. ఏపీకి ఒక భావి నాయకుడు లోకేష్ రూపంలో దొరికినట్టే.

# పాపం... శ్యామలేనా.. మిగిలింది

**విజయవాడ, నవంబర్ 5, పెన్ పవర్:**
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో పని చేసిన సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు పార్టీకి దూరమయ్యారు. 2024 ఎన్నికల్లో ఓటమి ఎదురైన తరువాత సినీ నటుడు అలీ తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని తేల్చేశారు. ఎన్నికలకు ముందే వైసిపి తో తనకు సంబంధం లేదన్నట్టు స్వచ్ఛందంగా తప్పుకున్నారు మంచు మోహన్ బాబు. అయితే నటుడు, రచయిత పోసాని కృష్ణ మురళి మాత్రం కాస్త యాక్టివ్గానే ఉండేవారు. వైసీపీలో క్రియాశీలకంగా పని చేసేందుకు సిద్ధమయ్యారు. కానీ వైసీపీ హయాంలో ఆయన చేసిన వ్యాఖ్యలు కు సంబంధించి కేసు మెడకు చుట్టుకుంది. చాలా రోజులు పాటు పోసాని జైలులోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఆ ప్రభావం ఆయన ఆరోగ్యం పై కూడా చూపింది. దీంతో వైసీపీలో క్రియాశీలకంగా ఉండడాన్ని తగ్గించేశారు పోసాని. అయితే ఇప్పుడు సినీ పరిశ్రమ నుంచి ఉన్నది కేవలం మాజీ మంత్రి రోజా మాత్రమే. అయితే తాజాగా ఆమెకు సినీ యాంకర్ శ్యామల తోడైంది. ప్రస్తుతం ఆమె సైతం పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తోంది.మొన్న ఆ మధ్యన కర్నూలు బస్సు ఘటన జరిగిన సంగతి తెలిసిందే. దీనిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫేక్ ప్రచారానికి దిగింది. హైదరాబాదు నుంచి బెంగళూరు వెళ్తున్న బస్సు అగ్ని ప్రమాదానికి గురైంది. ఓ ద్విచక్ర వాహనదారుడు ఇందుకు కారణం అని తేలింది. అయితే సదరు యువకుడు బెల్ట్ షాపులో నకిలీ మద్యం తాగడం వల్లే ఆ ఘటనకు కారణమయ్యాడని యాంకర్ శ్యామల ఆరోపించారు. అయితే సదరు యువకుడు మద్యం దుకాణంలో మద్యాన్ని కొనుగోలు చేసిన సీసీ ఫుటేజీ బయటకు వచ్చింది. కేవలం ప్రభుత్వం పై విమర్శలు చేసేందుకే శ్యామల ఆతరహా ఆరోపణలు చేసినట్టు తేలింది. దీంతో కర్నూలు పోలీసులు కేసు నమోదు చేశారు. నిన్ననే పోలీస్ స్టేషన్కు వెళ్లారు శ్యామల. వెంట కర్నూలు వైసీపీ నేతలు ఉన్నారు.అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు ఆ పార్టీకి క్రమేపి దూరమయ్యారు. కమెడియన్ అలీ లాంటి వ్యక్తులు సినీ పరిశ్రమలో ఇబ్బంది పడినట్టు వార్తలు వచ్చాయి. కానీ ఆయన కంటూ ప్రత్యేక గుర్తింపు సినీ పరిశ్రమలో ఉండడంతో నిలదొక్కుకున్నారు. మోహన్ బాబు సైతం ఏ పార్టీతో కలవకుండా తన పని తాను చేసుకుంటున్నారు. పోసాని కృష్ణ మురళి సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధపడ్డారు. కానీ యాంకర్ శ్యామల మాత్రం తిరిగి బుల్లితెరపై కనిపించడమే మానేశారు. అయితే ఆమె రాజకీయాలు చేసిన తర్వాత వృత్తిపరంగా పెద్దగా అవకాశాలు లేకుండా పోయాయి. అందుకే నెలకు 3 లక్షల రూపాయల వేతనంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా మారిపోయారు అన్న వార్తలు వచ్చాయి. కానీ బుల్లితెరపై యాంకరింగ్ అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. తప్పనిసరి పరిస్థితుల్లో ఆమె వైయస్సార్ కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.



చేశారు. దానికి ఏం చేయాలి? అధికారంలోకి వచ్చిన వెంటనే జోగి రమేష్ ను అరెస్టు చేయాలి. ఆ ఛాన్స్ వచ్చింది కూడా.. కానీ ప్రభుత్వం ఆ పని చేయలేదు. అయితే ప్రభుత్వం ఇదే ఉదాసీనతతో ఉంటుందని భావించిన జోగి రమేష్.. కల్తీ మద్యంతో చెడ్డ పేరు తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు. అలా ప్రయత్నం చేసే క్రమంలో ప్రధాన నిందితుడే తమను జోగి రమేష్ ప్రోత్సహించాడని బయట పెట్టేశారు. అంటే ఇప్పుడు అరెస్టు జరిగింది కొత్త కేసులో మాత్రమే. పాత కేసులను తిరగ దోడలేదు. కేవలం కొత్త కేసులో మాత్రమే జోగి రమేష్ ను అరెస్టు చేశారు.గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ విషయంలో కూడా అలానే జరిగింది. ఆయన దూకుడు తనం తెలియంది కాదు. పద్ధతి లేకుండా మాట్లాడేవారు. చంద్రబాబు వయసు లెక్క చేయకుండా నూటికి ఎంత వస్తే అంత మాట అనేవారు. సాక్షాత్ అసెంబ్లీలోనే చంద్రబాబు సతీమణి గురించి నీచంగా మాట్లాడారు. అయితే అధికారంలోకి వచ్చిన వెంటనే వల్లభనేని వంశీ మోహన్ జోలికి పోలేదు ప్రభుత్వం. కానీ తన పాత తప్పులు ఎక్కడ బయట పడతాయో.. అని కొత్త తప్పులు చేశారు వల్లభనేని వంశీ మోహన్. ఏకంగా టిడిపి కార్యాలయంలో పనిచేస్తున్న వ్యక్తిని బెదిరించారు. ఏరి కోరి కష్టాలను తెచ్చుకున్నారు. అలా ప్రభుత్వాన్ని కెలికి ఇబ్బందులు తెచ్చుకున్నారు. అంటే ప్రభుత్వం వారి జోలికి వెళ్లలేదు. ప్రభుత్వం జోలికి వారు వచ్చారన్నమాట.వైసీపీ హయాంలో సీనియర్ మంత్రులుగా ఉన్న చాలామంది ఇప్పుడు సేఫ్ జోన్ లో ఉన్నారు. ఎందుకంటే వారు రాజకీయాల్లో తమ కోసం తాము పని చేశారు. కానీ దూకుడు కలిగిన నేతల మనస్తత్వాన్ని గ్రహించారు జగన్. తన రాజకీయం కోసం వారిని పావులుగా వాడుకున్నారు. అయితే ఇప్పుడు వారే మూల్యం చెల్లించుకుంటున్నారు. తమపై వస్తున్న కొత్త కేసులతోనే తాము లోపల కు వెళ్లడం ఖాయమన్న వారు సైలెంట్ అవుతున్నారు. ఈ విషయంలో కొడాలి నాని, పేర్ని నాని, అనిల్ కుమార్ యాదవ్ లాంటి వారు చాలా జాగ్రత్త పడ్డారు. అవసరమైన మాటలను మాత్రమే ఆడుతున్నారు. చర్యలకు దిగడం లేదు కూడా..

### సేఫ్ జోన్ లో సీనియర్లు...

ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధితో దూసుకుపోతోంది. అమరావతి రాజధాని నిర్మాణం చేపడుతోంది. పోలవరం ప్రాజెక్టు పనులు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. మరోవైపు విశాఖకు భారీ ఐటి సంస్థలు వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం సైతం పరిశ్రమలను ఏర్పాటు చేస్తోంది. అయితే ఏ చిన్న లోపం వెలుగు చూసినా దానిని హైలెట్ చేస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ప్రజా పోరాటాలకు దూరంగా.. ప్రభుత్వంపై వ్యతిరేక ప్రచారానికి దగ్గరగా ఉంటుంది ఆ పార్టీ. అయితే ఇప్పుడు అంతా సోషల్ మీడియా యుగం. ప్రజలకు ఇట్టే నిజాలు తెలిసిపోతున్నాయి. ఇటువంటి సమయంలో స్ట్రాటజీలు మార్చాలి. కానీ వైసీపీ పాత చింతకాయ వాసన మాదిరిగా.. అదే ధోరణితో ముందుకు సాగుతోంది. అయితే ఇప్పుడు అరెస్టులు అంటూ గగ్గోలు పెడుతోంది. ఒకసారి అరెస్టుల తీరు చూస్తుంటే ఇట్టే అర్థం అవుతుంది. ధర్మాన ప్రసాదరావు జోలికి వెళ్లారా? బొత్స సత్యనారాయణ పై కేసులు నమోదు చేశారా? ఒకసారి కేసుల నమోదు.. అరెస్టులు జరుగుతున్న నేతల ట్రాక్ రికార్డును చూస్తే ఇట్టే అర్థమయిపోతుంది.తాజాగా మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్ట్ అయ్యారు. కల్తీ మద్యం కేసులో ఆయనను అరెస్టు చేశారు. వాస్తవానికి జోగి రమేష్ పై నమోదు చేసేందుకు చాలా కేసులు ఉన్నాయి. అరెస్టు చేసేందుకు అవసరమైన ఆధారాలు కూడా ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రం తో పాటు నవ్యాంధ్రప్రదేశ్లో మూడుసార్లు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు చంద్రబాబు. సీనియర్ మోస్ట్ లీడర్ కూడా.ఇంటిపై దాడికి ప్రయత్నించారు జోగి రమేష్. అప్పట్లో అది సంచలనమే. టిడిపి శ్రేణులు రక్తం మరిగింది. అధికార మదంతో నాడు జోగి రమేష్ ఆ ప్రయత్నం

# ఆస్ట్రేలియాతో నాలుగో టీ20.. కోహ్లీ రికార్డ్ సమం చేసే దిశగా అభిషేక్ శర్మ





**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియాతో జరుగుతున్న 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో టీమిండియా ఓపెనర్ అభిషేక్ అద్భుతంగా రాణిస్తున్నాడు. తన సూపర్ ఫామ్ ను కొనసాగిస్తూ తగ్గేదే లేదంటున్నాడు. ప్రత్యర్థి ఎవరైనా.. వేదిక ఎక్కడైనా.. బౌలర్ ఎవరైనా విధ్వంసకర బ్యాటింగ్ తో పరుగుల వరద పారిస్తున్నాడు. ఈ సిరీస్ లో ఇప్పటివరకు జరిగిన మూడు మ్యాచ్ ల్లో 112 పరుగులు చేసి ఈ సిరీస్ లో టాప్ స్కోరర్ గా నిలిచాడు. అభిషేక్ యావరేజ్ 37.33 కాగా.. స్ట్రైక్ రేట్ 167.16. సూపర్ ఫామ్ లో ఉన్న అభిషేక్ ఒక అరుదైన రికార్డుకు చేరువలో ఉన్నాడు. ఇండియాలో కోహ్లీ రికార్డుపై కన్నేశాడు. అభిషేక్ శర్మ అంతర్జాతీయ టీ20 ఫార్మాట్ లో ఇప్పటివరకు 6 ఇన్నింగ్స్‌లలో 36.96 యావరేజ్ తో 192.20 స్ట్రైక్ రేట్‌తో 961 పరుగులు చేశాడు. 1000 పరుగులు పూర్తి చేయడానికి అభిషేక్ ఇంకా 39 పరుగుల దూరంలో ఉన్నాడు. గురువారం (నవంబర్ 6) ఆస్ట్రేలియాతో జరగబోయే నాలుగో టీ20లో అభిషేక్ 39 పరుగులు చేస్తే అంతర్జాతీయ టీ20 క్రికెట్ లో ఇండియా తరపున ఫాస్టెస్ట్ 1000 రన్స్ చేసిన ప్లేయర్ గా కోహ్లీ రికార్డ్ సమం చేస్తాడు. కోహ్లీ 27 ఇన్నింగ్స్ ల్లో 1000 పరుగులు చేసి టాప్ లో కొనసాగుతున్నాడు. ఓవరాల్ గా ఈ లిస్ట్ లో ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ డేవిడ్ మలన్ ఉన్నాడు. ఈ ఇంగ్లాండ్ క్రికెటర్ కేవలం 24 ఇన్నింగ్స్ ల్లోనే 1000 పరుగులు పూర్తి చేసుకొని ఆల్ టైం టాప్ లో ఉన్నాడు. ఇటీవలే అభిషేక్ శర్మ ఐసీసీ చరిత్రలోనే అత్యధిక పాయింట్లు అందుకున్న బ్యాటర్‌గా వరల్డ్ రికార్డు నెలకొల్పాడు. ఆసియా కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచిన అభిషేక్.. 2020లో డేవిడ్ మలాన్ (919 పాయింట్లు) పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టాడు. ఆసియా కప్ లో ఈ పంజాబీ స్టార్ 314 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. యావరేజ్ 44 కాగా.. స్ట్రైక్ రేట్ 200 కావడం విశేషం. ఈ క్రమంలో అభిషేక్ తన టీమ్ మేట్స్ సూర్యకుమార్ యాదవ్ (912), విరాట్ కోహ్లీ (909) హయ్యెస్ట్ రేటింగ్ పాయింట్లను కూడా అధిగమించాడు. ఆస్ట్రేలియాతో 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో భాగంగా గురువారం (నవంబర్ 6) టీమిండియా నాలుగో టీ20 మ్యాచ్ ఆడనుంది. ఇప్పటికే మూడు టీ20 మ్యాచ్ లు
ముగిస్తే 1-1 తో సమంగా నిలిచాయి. ఇరు జట్ల మధ్య జరిగిన తొలి టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. శుక్రవారం (అక్టోబర్ 31) మెల్ బోర్న్ వేదికగా జరిగిన రెండో టీ20లో ఆస్ట్రేలియా 4 వికెట్ల తేడాతో ఘన విజ యం సాధించి 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మూడో టీ20 ఆదివారం (నవంబర్ 2) జరిగితే ఇండియా 5 వికెట్ల తేడాతో ఘన విజయంసాధించి 1-1 తో సమం చేసింది.

# నాలుగో టీ20లో బుమ్రా, గిల్‌కు రెస్ట్.. టీమిండియా ప్లేయింగ్ 11 ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియతో జరగనున్న నాలుగో టీ20కి టీమిండియా సిద్ధమవుతోంది. 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో భాగంగా గురువారం (నవంబర్ 6) జరగనున్న నాలుగో టీ20కి క్వీన్స్‌ల్యాండ్ లో కర్రారా ఓవల్ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. ఇప్పటికే సిరీస్ లో మూడు టీ20 మ్యాచ్ లు జరిగితే 1-1తో సమంగా నిలిచాయి. ఇరు జట్ల మధ్య జరిగిన తొలి టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. సిరీస్ గెలవాలంటే ఇరు జట్లు చివరి రెండు మ్యాచ్ ల్లో గెలవాలి. నాలుగో టీ20లో గెలిచిన జట్టుకు సిరీస్ ఓడిపోయే ఛాన్స్ ఉండదు. దీంతో రెండు జట్లు గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఈ మ్యాచ్ లో టీమిండియా ప్లేయింగ్ 11 ఎలా ఉందో ఇప్పుడు చూద్దాం..

అభిషేక్ శర్మతో పాటు సంజు శాంసన్ ఇన్నింగ్స్ ఆరంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. గిల్ మూడు ఫార్మాట్ లు ఆడుతూ ఇప్పటికే బాగా అలిసి పోయాడు. నవంబర్ 14 నుంచి సౌతాఫ్రికాతో టెస్ట్ సిరీస్ ఆడాల్సి ఉంది. దీంతో చివరి రెండు టీ20 లకు గిల్ కు రెస్ట్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మూడో స్థానంలో కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ ఆడతాడు. గత కొంతకాలంగా సూర్య విఫలమవుతున్నా.. ఒక్కసారి ఫామ్ లోకి వస్తే ఎంత ప్రమాదకరమో అందరికీ తెలుసు. నాలుగో స్థానంలో తిలక్ బ్యాటింగ్ కు వస్తాడు. ఐదో ప్లేస్‌లో వికెట్ కీపర్ కమ్ ఫినిషర్‌గా జితేష్ శర్మ ఆడతాడు. ఆరో స్థానంలో ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్ శివమ్ దూబే బ్యాటింగ్ కు వచ్చే అవకాశాలున్నాయి. ఏడో స్థానంలో ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ స్థానానికి ఎలాంటి ఢోకా లేదు. స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ స్వదేశానికి రావడంతో స్పిన్ ఆల్ రౌండర్ వాషింగ్ టన్ సుందర్ కొనసాగుతాడు. యార్కర్ల వీరుడు జస్ప్రీత్ బుమ్రాకు రెస్ట్ ఇచ్చే ఛాన్స్ ఉంది. అర్షదీప్ సింగ్ తో పాటు హర్షిత్ రానా, వరుణ్ చక్రవర్తి ప్లేయింగ్ 11 లో ఆడనున్నారు. ఒకవేళ గిల్, బుమ్రాలకు రెస్ట్ అవసరం లేదని భావిస్తే నాలుగో టీ20లో ఆడిన జట్టుతోనే టీమిండియా

**ఇండియా ప్లేయింగ్ 11 (అంచనా):**

అభిషేక్ శర్మ, సంజు శాంసన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అక్షర్ పటేల్, జితేష్ శర్మ, శివమ్ దూబే, వాషింగ్ టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రానా, అర్షదీప్ సింగ్

# నెక్స్ట్ లెవల్ ఎలివేషన్: ప్రతిష్టాత్మక టోర్నీకి గ్రాండ్ వెల్కమ్.. హెలికాప్టర్‌లో సిడ్నీకి యాషెస్ ట్రోఫీ




**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ లో ప్రస్తుతం యాషెస్ ఫీవర్ నడుస్తోంది. ప్రతిష్టాత్మకమైన ఈ మెగా టోర్నీ నవంబర్ 21 నుంచి ప్రారంభం కానుంది. ఐదు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో భాగంగా తొలి టెస్ట్ పెర్త్ వేదికగా నవంబర్ 21 నుంచి స్టార్ట్ కానుంది. సొంతగడ్డ కావడంతో ఆస్ట్రేలియా ఫేవరేట్ గా బరిలోకి దిగుతోంది. ఈ మెగా సిరీస్ కు 16 రోజుల సమయం మాత్రమే ఉంది. సొంతగడ్డపై జరగబోయే ఈ టెస్ట్ సిరీస్ ను ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో ఆస్ట్రేలియా ఉంది. మరోవైపు 2015 నుంచి యాషెస్ గెలవని ఇంగ్లాండ్ ఎలాగైనా ఆసీస్ కు షాక్ ఇవ్వాలని చూస్తోంది. యాషెస్ ట్రోఫీ ఎంట్రీనే ఓ రేంజ్ లో జరిగింది. సిడ్నీలో ఈ ప్రతిష్టాత్మక ట్రోఫీ హెలికాప్టర్ లో ద్వారా తీసుకొని వచ్చారు. సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ లో ఐకానిక్ ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ స్టీవ్ వా చేతుల మీదుగా యాషెస్ ట్రోఫీ ఆవిష్కరించబడింది. ట్రోఫీ హెలికాప్టర్ లో రావడంతో సిరీస్ నెక్స్ట్ లెవల్లో ఉంటుందని ఫ్యాన్స్ అంచనాకు వచ్చేశారు. ఇప్పటికే ఇరు దేశాలు తమ స్క్వాడ్ లను ప్రకటించేశాయి. ఆస్ట్రేలియా క్రికెటర్లు యాషెస్ ప్రాక్టీస్ లో భాగంగా నెట్స్ లో తీవ్రంగా చెమటోడుస్తున్నారు. త్వరలోనే ఇంగ్లాండ్ జట్టు ఆస్ట్రేలియా చేరుకోనుంది. క్రికెట్ లో ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య జరిగే యాషెస్ కు స్పెషల్ క్రేజ్ ఉంది. క్రికెట్ లో తొలి మ్యాచ్ నుంచి వీరి మధ్య సమరం ఇప్పటికీ ఓ రేంజ్ లో కొనసాగుతోంది. నవంబర్ 21 నుంచి ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్ స్టార్ట్ అవుతుంది. ఐదు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ఆస్ట్రేలియాలో జరగనుంది. 1882లో తొలిసారి యాషెస్ సిరీస్ జరిగింది. ప్రతి రెండేళ్లకోసారి ఈ ప్రతిష్టాత్మక సిరీస్ వచ్చినప్పుడల్లా క్రికెట్ ప్రపంచంలో చర్చ జరుగుతూనే ఉంటుంది. చివరిసారిగా ఇంగ్లాండ్ లో జరిగిన యాషెస్ 2-2 తో సమమైంది. తొలి రెండు టెస్టులు ఆస్ట్రేలియా గెలిస్తే చివరి మూడు టెస్టుల్లో ఇంగ్లాండ్ రెండు టెస్టులు గెలిచింది. ఒక మ్యాచ్ డ్రా గా ముగిసింది. అంతకముందు 2021-22 యాషెస్ లో ఆస్ట్రేలియా 4-0తో గెలిచింది. ఆస్ట్రేలియా చివరి 15 స్వదేశీ టెస్టుల్లో రెండింటిలో మాత్రమే ఓడిపోయింది. ఓవరాల్ గా ఇప్పటి వరకూ చరిత్రలో మొత్తం 330 యాషెస్ టెస్ట్ మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో ఆస్ట్రేలియా 136 టెస్టులు, ఇంగ్లండ్ 108 టెస్టులు గెలవగా.. 91 మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. ఇటీవలే ఇండియాతో ఇంగ్లాండ్ 5 మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ను 2-2 తో సమం చేసుకుంది. మరోవైపు ఆస్ట్రేలియా వెస్టిండీస్ పై 3-0 తేడాతో గెలిచింది.

# మనోజ్ ముందు జాగ్రత్త.. ఆ హీరోల ఎఫెక్ట్ పడిందా?







మంచు మనోజ్.. ఈ పేరు గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. చేసింది తక్కువ సినిమాలే అయినా అటు అభిమానులతోనే కాదు ఇటు సినీ సెలబ్రిటీలతో కూడా మంచి సత్సంబంధాలు కొనసాగిస్తూ భారీ పాపులారిటీ సొంతం చేసుకున్నారు. మంచు మోహన్ బాబు వారసుడిగా సినీ ఇండస్ట్రీలోకి చైల్డ్ ఆర్టిస్టుగా అడుగుపెట్టిన మనోజ్ హీరోగా సత్తా చాటి.. వ్యక్తిగత కారణాలవల్ల తొమ్మిదేళ్లు ఇండస్ట్రీకి దూరమయ్యారు.. ఇటీవలే మళ్లీ రీఎంట్రీ ఇచ్చారు. అందులో భాగంగానే భైరవం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి పరవాలేదు అనిపించకున్న మనోజ్.. ఆ తర్వాత వచ్చిన మిరాయ్ సినిమాతో ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చేసారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడిగా తొలి ప్రయత్నంలో చేసిన చిత్రం మిరాయ్. తేజ సజ్జ హీరోగా, రితిక నాయక్ హీరోయిన్ గా .. జగపతిబాబు, శ్రియశరణ్ , గెటప్ శ్రీను తదితరులు కీలకపాత్రలు పోషిస్తూ తెరకెక్కిన చిత్రం ఇది. సెప్టెంబర్ 12వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకోవడమే కాకుండా వందకోట్ల క్లబ్లో చేరి రికార్డు సృష్టించింది. జియో హాట్ స్టార్ వేదికగా ఓటీటీలో కూడా స్ట్రీమింగ్ అవుతూ.. మంచి రేటింగ్ అందుకుంటుంది.

ఇందులో విలన్ పాత్ర పోషించి అందరిని అబ్బురపరిచారు మంచు మనోజ్. హీరోగా కంటే విలన్ పాత్రకి ఎక్కువ క్రేజ్ లభించింది. అలా ఈ మిరాయ్ సినిమాతో భారీ పాపులారిటీ అందుకున్న మనోజ్ కి.. ఇప్పుడు బాలీవుడ్ నుండి వరుసగా అవకాశాలుస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ అవకాశాలను మనోజ్ సున్నితంగా తిరస్కరిస్తూ తెలుగులోనే సినిమాలు చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నట్లు సమాచారం. అంతేకాదు బాలీవుడ్ సినిమాలను తిరస్కరించి ఇప్పుడు ఒక టాలీవుడ్ మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కూడా తెలుస్తోంది. మనోజ్ తీసుకున్న ఈ నిర్ణయంపై అభిమానులలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి అని చెప్పవచ్చు. వాస్తవానికి ఎవరైనా సరే బాలీవుడ్లో అవకాశాలు వచ్చాయి అంటే కచ్చితంగా రిజెక్ట్ చేయరు. పైగా బాలీవుడ్లో అవకాశం కోసం ఎదురుచూస్తారు కూడా.. అలాంటి బాలీవుడ్ నుంచి స్వయంగా అవకాశాలు తలుపు తట్టినా.. మంచు మనోజ్ మాత్రం తిరస్కరించడంతో పలు రకాల కామెంట్లు వ్యక్తం అవుతున్నాయి. గతంలో చిరంజీవి, రామ్ చరణ్, ఎన్టీఆర్ ఇలా బడా స్టార్ హీరోలు అంతా కూడా బాలీవుడ్ లో సినిమాలు చేసి డిజాస్టర్ ను మూటగట్టుకున్నారు. అందుకే ఆ హీరోల చిత్రాల ఫలితాల ప్రభావం ఇప్పుడు మంచు మనోజ్ పై భారీ ప్రభావాన్ని చూపించిందని.. అందుకే ముందు జాగ్రత్తగా మేల్కొని బాలీవుడ్ చిత్రాలకు అంగీకరించడం లేదు అంటూ కొంతమంది నెటిజన్స్ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా మంచు మనోజ్ ఇప్పుడు బాలీవుడ్ అవకాశాలను తిరస్కరిస్తూ టాలీవుడ్ లోనే సినిమాలు చేయడానికి ఆసక్తి కనబరిస్తుండడం హాట్ టాపిక్ గా మారింది.

మంచు మనోజ్ నటిస్తున్న చిత్రాల విషయానికి వస్తే.. అహం బ్రహ్మస్మి.. శ్రీకాంత్ ఎన్ రెడ్డి దర్శకత్వం వహించిన తెలుగు చిత్రం ఇది. 2025 డిసెంబర్ 20న విడుదల కాబోతోంది. అలాగే వాట్ ది ఫిష్.. వరుణ్ కొరుకుంద దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంతో పాటు నూతన దర్శకుడు నవీన్ కొల్లి దర్శకత్వం వహిస్తున్న రక్షక్ అనే సినిమాలో కూడా నటిస్తున్నారు. అలాగే అంతర్జాతీయ సీరిస్ గా రూపుదిద్దుకుంటున్న బ్లాక్ స్వోర్డ్ లో మనోజ్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Nagendla venkateswarlu, Door no:7-1-107, station road, Narasaraopet, Palnadu District Andhrapradesh- 522601 Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2292, editorpenpower@gmail.com